teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 210 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 28 నవంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ స్థాయి ప్రచారం

### న్యూఢిల్లీలో ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం




న్యూ ఢిల్లీ, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం బుధవారం న్యూఢిల్లీలో బాల్ వివాహ ముక్త్ భారత్ అనే జాతీయ ప్రచారాన్ని ప్రారంభించింది. భారతదేశాన్ని బాల్య వివాహాలు లేని దేశంగా మార్చడమే ప్రచారం యొక్క ప్రాథమిక ఎజెండా. ఈ ప్రచారాన్ని ప్రారంభించిన మహిళా, శిశు అభివృద్ధి

మిగతా 2 లో



## ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలనలో ఏం చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీని బుధవారం

మిగతా 2 లో



## వికలాంగుల స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క

### డిసెంబర్ 3న వికలాంగుల దినోత్సవ ఉత్సవాలు జరుపుకుందాం

హైదరాబాద్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): గచ్చిబౌలి స్టేడియంలో వికలాంగుల రాష్ట్ర స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ మీట్ ను తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారా ఒలంపిక్స్‌లో మెడల్ సాధించి దేశ ఔన్నత్యాన్ని, ప్రపంచానికి

మిగతా 2 లో

# పాఠశాల్లో ఫుడ్ పాయిజనింగ్ పై హైకోర్టు ఆగ్రహం

### భోజనం వికటించిన పాఠశాలల్లో శాంపిల్స్ సేకరించాలి

### నమూనా నివేదికల సమర్పనకు ఆదేశించిన హైకోర్టు


### బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచనలు






హైదరాబాద్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పాఠశాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై, హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భోజనం వికటించిన అన్ని పాఠశాలల్లో శాంపిల్స్ సేకరించాలని ఆదేశించింది. నమూనాలను ల్యాబ్‌కు పంపించి సోమవారం వరకు పూర్తి నివేదికను సమర్పించాలని ప్రభుత్వాన్ని

మిగతా 2 లో





# సంక్షేమ హాస్టల్ ఏడవ తరగతి విద్యార్థి ఆత్మహత్య

గతంలోనూ ఓ విద్యార్థి మృతి

ఇద్దరు విద్యార్థుల మృతి అనుమానాస్పదంగానే..?

సర్వత్రా ఆందోళన వ్యక్తం

పర్యవేక్షణ లోపంతో ప్రమాదంలో విద్యార్థులు

ఆలనా పాలన లేక హాస్టళ్ళు అస్తవ్యస్తం

గురుకులాల్లో డేంజర్ బెల్స్

పరిష్కారంకోసం రోడ్ ఎక్కిన విద్యార్థులు

విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ధర్నా



వనపర్తి జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): గురుకులాల్లో డేంజర్ బెల్స్.. గురుకుల పాఠశాలలో ఆగని మరణాలు. ప్రభుత్వ విద్య పర్యవేక్షణ లోపంతో ప్రమాదంలో పడిపోయింది. విద్యార్థుల ప్రాణాలను తీస్తు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. సంక్షేమ హాస్టళ్ళు

మిగతా 2 లో

## నేటి నుంచి ప్రారంభంకానున్న

# రైతు పండుగ

### మూడు రోజుల పాటు నిర్వహించనున్న విజయోత్సవాలు



తెలంగాణ బ్యూరో, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో నేటి నుంచి రైతు పండుగ ప్రారంభం కానుంది. రేవంత్ సర్కార్ మూడు రోజుల పాటు రైతు విజయోత్సవాలు నిర్వహించనుంది. రైతులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం ఈ వేడుకలు జరుపనుంది. రేపటి నుంచి రైతులకు

మిగతా 2 లో



# ఢిల్లీ పర్యటనలో తెలంగాణ మంత్రులు బిజీ బిజీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి పొన్నం భేటీ

రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యలపై చర్చించిన పొన్నం

హైదరాబాద్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్) తెలంగాణ రాష్ట్ర మంత్రులు ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నితిన్ గడ్కరీతో రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యలు, అంశాలపై పొన్నం ప్రభాకర్ చర్చించారు. ఇందులో



## తెలంగాణ మంత్రుల భేటీపై మోదీ తెలుగులో ట్వీట్

### కాంగ్రెస్, బీఆర్ఎస్ లవి ప్రజా వ్యతిరేక విధానాలు

### అధికారమే లక్ష్యంగా పని చేయండి: మోదీ

తెలంగాణ బ్యూరో, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ బీజేపీ నేతలు బుధవారం ప్రధాని మోదీని ఢిల్లీని కలిసిన విషయం తెలిసిందే. అయితే ఈ భేటీపై మోదీ తెలుగులో ట్వీట్ చేశారు. తెలంగాణ బీజేపీ శాసనసభ్యులతో, ఎంపీలతో చాలా మంచి సమావేశం జరిగిందన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ ఉనికి వేగంగా విస్తరిస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్తో విసిగిపోయారన్నారు. అంతేకాక

మిగతా 2 లో

## సీఎం రేవంత్‌ని కూల్చివేతల మనిషిగా వర్ణించిన బీజేపీ నేత

### రేవంత్ ఫోటోతో కూడిన పోస్టర్ విడుదల




సీఎం రేవంత్ రెడ్డిని డెమోలిషన్ మ్యాన్ కూల్చివేతల మనిషి) గా అభివర్ణిస్తూ బీజేపీ నేత, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ రేవంత్ ఫోటోతో కూడిన పోస్టర్ విడుదల చేశారు.

హైదరాబాద్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఈ సందర్భంగా బూర మాట్లాడుతూ స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రజల పరిస్థితి బీఆర్ఎస్ పాలన నుంచి కాంగ్రెస్ పాలనలోకి వచ్చాకా పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో గ్యారంటీల హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. మార్పు రావాలంటే కాంగ్రెస్ రావాలని

మిగతా 2 లో



## టెలికాం కంపెనీలు ట్రేస్‌బిలిటీ నియమ అమలు తప్పనిసరి

### నవంబర్‌తో ముగియనున్న గడువు

న్యూ ఢిల్లీ, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): ఆన్‌లైన్ మోసాలను నిరోధించడానికి ట్రేస్‌బిలిటీని అమలు చేయాలని ఇటీవల ట్రై టెలికాం కంపెనీలను ఆదేశించించిన విషయం తెలిసిందే. ఇదొక పెద్ద నిర్ణయం. వాణిజ్య సందేశాలు, ఓటీపీకి సంబంధించిన ట్రేస్బిలిటీ నియమాలను అమలు చేయడానికి ట్రాయ్ ఆగస్టులో ఆదేశాలు జారీ చేసింది. కానీ ఈ రూల్స్‌ను ట్రాయ్ అనేక సార్లు పొడిగించింది. ట్రై ఓటీపీ మెసేజ్

మిగతా 2 లో

## వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కోసం క్విజ్

### క్విజ్ చేరాలని యువతను కోరిన ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): చారిత్రాత్మక వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో భాగమయ్యేలా చేసే క్విజ్‌లో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం యువకులను కోరారు. వికసిత్ భారత్ ఛాలెంజ్ అనేది నాలుగు-దశల పోటీ, ఇది యువకులను పాల్గొనడానికి మరియు ఆలోచనలను అందించడానికి ఆహ్వానిస్తుంది. నవంబర్ 25 నుండి వచ్చే నెల 5 వరకు ఆల్ -ఇండియా డిజిటల్ క్విజ్ పోటీతో ఛాలెంజ్ ప్రారంభమవుతుంది. ఈ పోటీ 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తులందరికీ అందుబాటులో ఉంటుంది. సోషల్ మీడియా పోస్ట్‌లో, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ఇది యువకుల చెరగని సహకారం అని మోదీ వ్యాఖ్యానించారు.



## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురుకుల బాట కార్యక్రమం

### వరుస ఘటనలపై బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం

తెలంగాణ బ్యూరో, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో నిత్యం ఫుడ్ పాయిజన్ జరిగి అమాయక విద్యార్థులు మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. కాగా ఈ వరుస ఘటనలపై బీఆర్ఎస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురుకుల బాట కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఆ ప్రకటనలో రాష్ట్రంలో గురుకులాలు, పాఠశాల విద్యను రేవంత్

మిగతా 2 లో

# సంక్షేమ హాస్టల్ "ఏడవ తరగతి" విద్యార్థి ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

సమస్యలకు నిలయాలుగా మారాయా..? మౌలిక సదుపాయాలు లేక గురుకుల పాఠశాలలు పిల్లలకు శాపాలుగా పరిణమిస్తున్నాయా..? ఆలనా పాలన లేక హాస్టళ్ళు అస్తవ్యస్తంగా మారాయా..? అంటే జరుగుతున్న పరిణామాలు చూస్తే ఔననే సమాధానం వస్తుంది. చదువులమ్మ ఒడి సర్కార్ బడి.. ఆ బడిలో చదివే పేద పిల్లలకు వసతి కల్పించే సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, అనూహ్యంగా ప్రాణాలు కోల్పోవడం కలకలం సృష్టిస్తుంది. ఇక్కడ అక్కడ అనే తేడాలేదు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం గురుకుల పాఠశాలలో గతంలో ఒక విద్యార్థి మృతిచెందగా... మళ్లీ అదే రిపీట్ తో మదనాపురం బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ప్రవీణ్ (13) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక మండల పరిధిలో కొన్నూర్ చెందిన తప్పెట శ్రీనివాసులు, సత్యమ్మ దంపతులు తమ పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. వారి చిన్న కుమారుడు ప్రవీణ్ హైదరాబాద్ లోనే గురుకుల పాఠశాలలో సీటు వచ్చింది. అక్కడే చదువుతుండగా తల్లిదండ్రులు తిరిగి తమ సొంత ఊరుకు రావాలని ఉద్దేశంతో తమ కుమారుడిని మదనాపురం గురుకుల పాఠశాలలో 2నెలలు క్రితం చేర్పించారు. మంగళవారం రోజు కబడ్డీ ఆడుతుండగా చిన్నపాటి గాయం తగిలింది.ఈ విషయాన్ని తండ్రికి ఫోన్ చేసి తండ్రికి తెలియజేసి తనను ఇంటికి తోలుకు పొమ్మని కోరినట్లు తెలిసింది. దీనితో తండ్రి తన కుమారుడికి సర్ది చెప్పి బుధవారం ఉదయము మీ బాబాయిని పంపిస్తానని చెప్పి బుజ్జగించినట్లు సమాచారం. ఉదయం విద్యార్థులు అల్పాహారం తీసుకున్న తర్వాత అందరూ విద్యార్థులు తరగతి గదులకు వెళ్లగా ప్రవీణ్ తాను ఉంటున్న గదిలోకి వెళ్లి తన బెడ్ బెడ్ షీట్ దుప్పటితో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హుటాహుటిన వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఏలా చనిపోయారో స్పష్టత లేక మిస్టరీగానే మారి సర్వత్రా ఆందోళనకు గురి చేస్తోంది. అధ్వాన్న పరిస్థితిలో గురుకులం 700 మంది విద్యార్థులు ఉన్న గురుకులంలో అధ్వాన్న పరిస్థితులు ఉన్నాయి. గతంలో ఒకరు ఇప్పుడు ఒకరు ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం పాముకాట్ల గురి కావడం మరియు అస్వస్థతకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని గురుకులంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం ఉన్నప్పటికి కనీస సౌకర్యాలు లేక పిల్లలు పట్టించుకునే వారు కానరాక దుర్భర పరిస్థితిల్లో పిల్లలు చదువుకునే దుస్థితి నెలకొందని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గురుకులం అపరిశుభ్రమైన వాతావరణంలో కరెంట్ ఉన్నా ఫ్యాన్ లు ఉండవు డైనింగ్ హాల్ ఉన్నా మెను ప్రకారం భోజనం పెట్టరు. గ్రౌండ్ ఉన్నా ఆడుకునేలా పరిసరాలు అనుకూలంగా లేని పరిస్థితులు ఉన్నాయి. ఈ దుస్థితికి కారణం ఎంటో చెప్పే నాథుడే ఉండడు.



### పాములతో సావాసం

దుర్భరమైన పరిస్థితిలో పాములు, తేళ్ళు, విష పురుగులతో సావాసం చేస్తున్నారు పిల్లలు. గురుకులంలో ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతుంది. ఇద్దరు మృతి, అస్వస్థతలకు గురి కావడంతో పేరెంట్స్ భయాందోళన చెందుతూ పిల్లలను స్వగ్రామాలకు తీసుకెళ్ళారు.హాస్టల్ లో సీటు వచ్చిందంటే సంబరపడ్డాం.. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో భయపడాల్సిన వస్తుందని విద్యార్థులతోపాటు పేరెంట్స్ ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న హాస్టల్లో పిల్లలను ఉంచి చదివించాలంటే భయమేస్తుందని అంటున్నారు పేరెంట్స్. కుళ్లిపోయిన చల్లటి కొళాయి నీళ్ళు, లేకపోతే హౌస్ లు, వండడానికి కుళ్ళిన పుచ్చువైన కూరగాయలు,నీళ్ల చారుతో భోజనం పెడుతున్నట్లు కొందరు విద్యార్థులు తెలిపారు. అంతేకాక కిటికీలకు, రూమ్‌లకు మెష్ (దోమ తెరలు) లు ఏర్పాటు చేయకపోవడం, ఫ్యాన్లు సరిగ్గా తిరగకపోవడంతో దోమలు, ఈగలతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో పాములు, తేళ్లు లాంటి విషపూరిత పురుగుల కాటుకు విద్యార్థులు గురవుతున్నారు. బాత్రూములలో మురికి నీరు సైతం వసతి గృహాల చుట్టూ చేరడంతో దోమలు, క్రిమి కీటకాలతో అనారోగ్య బారిన పడుతున్నారు. దీంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో రాత్రివేళ సరిగా నిద్రపోవడం లేదని కొంతమంది విద్యార్థులు ఏడుస్తున్నారు. బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన గురుకులాలపై పర్యవేక్షణ కరువవుతున్నది. తరచూ ఏదో ఒక ఘటన వెలుగులోకి రావడం ఆందోళన కలిగిస్తున్నది. విద్యార్థుల మరణాలు,అస్వస్థత లాంటి ఘటనలు జరిగినప్పుడే హడావుడి చేస్తున్నా ఆ తర్వాత షరామామూలే అవుతున్నది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించి, బసచేసిన ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫలితంగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు తయారు కాగా, సమస్యలు పరిష్కారం కాక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. వసతి గృహంలో టాయిలెట్ల నిర్వహణ సైతం సక్రమంగా లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లే పరిస్థితి ఏర్పడుతున్నాయి. ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు ప్రతిపక్షాలు మృతి చెందిన విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని రోడ్డుపై కూర్చొని ధర్నా నిర్వహించారు.





## సీఎం రేవంత్‌ని కూల్చివేతల మనిషిగా వర్ణించిన బీజేపీ నేత

మొదటి పేజీ తరువాయి

చెప్పి, దేవుళ్ల మీద ఒట్టేసి అధికారంలోకి వచ్చి ప్రజలను, దేవుళ్లను మోసం చేస్తున్నారన్నారు. మహాలక్ష్మీ రూ.2500 పథకం, రైతుభరోసా, పెరిగే పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, తులం బంగారం సహా 420హామీలు, గ్యారంటీల ఊసు లేదన్నారు. ఆగస్టులో మొదలైన రుణమాఫీ ఇప్పటికి పూర్తి కాలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి డెమోలిషన్ మ్యాన్ (కూల్చివేతల మనిషి)గా మారిపోయి కూల్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడని విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూసేకరణ, రహదారుల పేరుతో , ఫార్మా కంపనీల పేరుతో కూల్చివేతలు, లాక్కోవడం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి వెనుకబడిన, పేద మరియు మధ్యతరగతి వర్గాల ఇళ్లను కూల్చివేస్తాడని, కాంగ్రెస్ ఉన్నతవర్గం, వారి బీఆర్ఎస్ మిత్రపక్షాలు, ఒవైసీ సోదరుల విశాలమైన అక్రమ నిర్మాణాలు, రాజభవనాల వంటి ఫామ్‌హౌస్‌లను మాత్రం కూల్చబోరని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, నిర్వాసితులకు న్యాయం చేయాలన్నదే మా డిమాండ్ అన్నారు. కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన చేపట్టినా పూర్తి చేసేది బీజేపీ తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో మూసీ ప్రక్షాళన కంటే ముందుగా కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేస్తే మంచిదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కుల గణన పూర్తికాగానే దమ్ముంటే 42శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థలు ఎన్నికలు జరుపాలన్నారు. హర్యానాలో, మహారాష్ట్రలో బీజేపీ సర్వేలకు భిన్నంగా విజయం సాధించిందని, జార౦ండ్, జమ్మూ కశ్మీర్ లలో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హర్యానా, మహారాష్ట్ర, జార౦ండ్, జమ్మూ కశ్మీర్లలో కలిపి 50సీట్లు కూడా గెలవలేదన్నారు. కాంగ్రెస్, రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

## టెలికాం కంపెనీలు ట్రేస్‌బిలిటీ నియమ అమలు తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

ట్రేసబిలిటీని అమలు చేయడానికి టెలికాం కంపెనీలకు అక్టోబర్ 31 వరకు సమయం ఉండేది. కానీ మరోసారి పొడిగింపు తర్వాత ఇప్పుడు నవంబర్ 31 వరకు మాత్రమే ఉంది. జిఓ, ఎయిర్టెల్, వీఐ, బీఎస్ఎన్ఎల్ డిమాండ్‌ను అనుసరించి, కంపెనీ తన గడువును పొడిగిస్తూ వచ్చింది. ఇప్పుడు దాని గడువు నవంబర్‌లో ముగియబోతుంది. వాణిజ్య సందేశాలు, ఓటీపీ మెసేజ్‌లను ట్రాక్ చేయడానికి టెలికాం కంపెనీలు ట్రేస్‌బిలిటీ నియమాన్ని అమలు చేయాల్సి ఉంటుంది.

### OTP రావడానికి సమయం పట్టవచ్చు:

జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ వంటి టెలికాం కంపెనీల డిసెంబర్ 1 నుండి ట్రేసబిలిటీ నియమాన్ని అమలు చేస్తే, ఓటీపీ మెసేజ్ రావడానికి సమయం పట్టవచ్చు. అటువంటి పరిస్థితిలో మీరు బ్యాంకింగ్ లేదా రిజర్వేషన్ వంటి ఏదైనా పని చేస్తే, మీరు ఓటీపీ పొందడానికి సమయం పట్టవచ్చు. ట్రాయ్ అటువంటి చర్య తీసుకుంది. ఎందుకంటే అనేక సార్లు స్కామర్లు నకిలీ ఓటీపీ మెసేజ్‌లను పొందుతూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు ట్రాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. దీన్ని అన్ని టెలికాం కంపెనీలకు కచ్చితంగా అమలు చేయాలని ట్రాయ్ ఆదేశించింది. కానీ నవంబర్ 31 తర్వాత ఖచ్చితంగా అమలు చేస్తుందా? లేదా పొడిగింపు ఏమైనా ఉంటుందా? అనేది చూడాలి.

## నేటి నుంచి ప్రారంభంకానున్న రైతు పండుగ

మొదటి పేజీ తరువాయి

ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 30వ తేదీన మహబూబ్ నగర్ లో పెద్ద ఎత్తున రైతు విజయోత్సవ సభ ఏర్పాటు చేయనుంది.

### రూ. 54,280 కోట్లు

తొలి ఏడాదిలో రైతుల సంక్షేమానికి 55 వేల కోట్లు ఖర్చు చేసిన రేవంత్ సర్కార్ రైతులకు ఉచిత విద్యుత్తుకు ఈ ఏడాది 10, 444 కోట్లు సబ్సిడీ చెల్లించింది. 22. 22 లక్షల మంది రైతు కుటుంబాలకు 17, 870 కోట్ల రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసింది. యాసంగి రైతు బంధు 7625 కోట్లను రైతు ఖాతాలో వేసింది. రైతుల పంటల భీమా ప్రీమియం 1300 కోట్లు చెల్లించింది. రైతు బీమా పథకం ప్రీమియం 1,455 కోట్లు జమ చేసింది. 2023-24 ధాన్యం కొనుగోలుకు రూ.10, 547 కోట్లు ఖర్చు చేసింది. ఈ సీజన్ లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ. 5,040 కోట్లు పెట్టినట్లు తెలుస్తోంది. ఇలా రైతుల కోసం రేవంత్ ప్రభుత్వం మొత్తం రూ. 54,280 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

### రైతు సభపై చర్చ

మహబూబ్ నగర్‌లో జరగనున్న రైతు సభపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జూమ్ మీటింగ్ జరిగింది. జూమ్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 12 నెలల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయలేనంత గొప్ప కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో చేపట్టిందన్నారు. ఇప్పటికే సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో వరంగల్ వేములవాడలో భారీ బహిరంగ సభలో విజయోత్సవాలను జరిపినట్లు తెలిపారు.

### ఎవరు చేయలేనంతగా

ఈ క్రమంలోనే 30వ తేదీన మహబూబ్నగర్ లో పెద్ద ఎత్తున రైతు పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రైతు ఉత్సవం గతంలో ఎవరు చేయలేనంత పెద్ద ఎత్తున జరగాలన్నారు. నా భూతో నా భవిష్యతి అన్నట్టుగా భారీ బహిరంగ సభ నిర్వహించి రైతులకు వ్యవసాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పెద్దలు ప్రతి గ్రామంలో రైతులను మహబూబ్ నగర్ తరలించాలన్నారు. అక్కడ జరిగే రైతు ఉత్సవాల్లో మన పెద్దలు చెప్పే కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా చూడాలని సూచించారు.

### సీఎం కార్యాలయానికి నివేదిక

దిలావర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనపై ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేసినట్టు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారన్నారు. ప్రజలు సంయమనం పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

ఈ సందర్భంగానే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది పాటు అనేక వ్యవసాయ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు 30వ తేదీన మహబూబ్ నగర్ లో జరిగే రైతు సదస్సులో వివరించడం జరుగుతుందని తెలిపారు. రేపు మహబూబ్ నగర్ లో భారీ ఎత్తున వ్యవసాయ ప్రదర్శన ఉందని తెలిపారు. అలాగే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా ఆయా ఇంచార్జ్ మంత్రులు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహబూబ్ నగర్ రైతు సదస్సు ను పెద్ద ఎత్తున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీ పర్యటనలో తెలంగాణ మంత్రులు బిజీ బిజీ

మొదటి పేజీ తరువాయి

భాగంగా తెలంగాణలో రవాణా శాఖ వాహనాల రిజిస్ట్రేషన్లను వాహన్ పోర్టల్ కు, డ్రైవింగ్ లైసెన్సులు సారథి పోర్టలకు మార్చడం, వాహన స్క్రాపింగ్ సౌకర్యాల ఏర్పాటు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుల ఏర్పాటు, రోడ్డు భద్రత అవగాహన ప్రచారాలను నిర్వహించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేయబడే వివిధ రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు 100% రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను మినహాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి మంత్రి చేసిన విజ్ఞప్తులు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల 40 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాం అక్కడ ఈ కింది వాటికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఢిల్లీలోని ఐడీటీఆర్ తరహాలో 15వ ఫైనాన్స్ కమిషన్ కింద హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాలో డ్రైవర్లకు చాలా శిక్షణ అవసరం ఉందని దీని కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. బహుళ-లేన్ ఆటోమేటిక్ వెహికల్స్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌ను నిర్మించడానికి అనుమతి ఇవ్వాలని, రోడ్ సేఫ్టీ కోసం పబ్లిక్ వాహనాల పర్యవేక్షణ కోసం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్ మెంట్ అమలు కోసం, ఈ-చలాన్‌ల ఆటో జనరేషన్ ద్వారా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను గుర్తించాలని తెలిపారు. అలాగే ఎంవీఐ లు, ఏఎంవీఐ లకు నాణ్యమైన సాంకే తికంగా ఫీల్డ్ శిక్షణ ఇవ్వడానికి నిధులు మంజూరు చేయాలని ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల స్థాపనకు భారీ డిమాండ్ ఏర్పడిందని ఎప్పటిక ప్పుడు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు. అంతే కాకుండా తన నియోజకవర్గం హుస్నాబా ద్‌లో పలు సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ భేటీలో మంత్రితో పాటు ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రఘురామ్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, సురేష్ షెట్కార్ పాల్గొన్నారు.

## బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ స్థాయి ప్రచారం

మొదటి పేజీ తరువాయి

శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి మాట్లాడుతూ ప్రభుత్వం 130 జిల్లాలను గుర్తించిందని, ఈ ప్రచారాన్ని కేంద్రీకృతంగా అమలు చేస్తామని చెప్పారు. బాల్యవివాహాలు కేవలం చట్టరీత్యా నేరం కాదని, మానవ హక్కుల ఉల్లంఘన అని ఆమె ఎత్తిచూపారు. బాల వివాహ ముక్త్ భారత్ క్యాంపెయిన్ కేవలం 10 లేదా 15 రోజుల కార్యక్రమం మాత్రమే కాదని, బాల్య వివాహాల దురాచారం నుండి భారతదేశం విముక్తి పొందే వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి బాల్య వివాహ రహిత భారత్ పోర్టల్‌ను కూడా ఆవిష్కరించారు. అవగాహన పెంపొందించడం, బాల్య వివాహాలను నిరోధించడం మరియు బాల్య వివాహాల సంఘటనలను ప్రభావవంతంగా నివేదించడం వంటి ప్రచార లక్ష్యానికి మద్దతుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ అభివృద్ధి చేయబడింది.

## పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ పై హైకోర్టు ఆగ్రహం





మొదటి పేజీ తరువాయి

ఆదేశించింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచిస్తూ తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. మాగనూరు ఘటనపై దాఖలైన పిటిషన్‌పై బుధవారం విరామం తర్వాత మరోసారి హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అస్వస్థతకు గురైన పిల్లలు బయటి చిరుతిళ్లు తిన్నారని ఏఏజీ వాదనలు వినిపించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రికి తరలించామని తెలిపారు. బాధ్యులపైన వారిపై చర్యలు తీసుకున్నాని చెప్పారు. అధికారులపై ఏ చర్యలు తీసుకున్నారో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

## ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిశారు. అనంతరం, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర నేతలతో ప్రధాని మోదీ చర్చించారు. తెలంగాణలో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అభివృద్ధి విషయంలో సానుకూల ధోరణితో పని చేయాలన్నారని చెప్పుకొచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో ఏం చేశారో రేవంత్ రెడ్డి చెప్పాలి. వంద రోజులలో ఆరు గ్యారెంటీల అమలులో విఫలమయ్యారు. నాది బీజేపీ డీఎన్ఏ మీలాగా పది పార్టీలు మారిన డీఎన్ఏ కాదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలపై డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రచారం చేస్తాం. ఇప్పటికైనా సీఎం రేవంత్, విపక్షాలను తిట్టే బదులు పాలనపై దృష్టి పెట్టాలి. విషాహారం తిని విద్యార్థులు చనిపోవడానికి గల కారణాలపై దృష్టి సారించాలి. ఎమ్మెల్యేల ఫిరాయింపులను నిస్సిగ్గుగా ప్రోత్సహిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు దొందూ దొందే అన్న చందంగా వ్యవహరిస్తున్నాయి అంటూ ఘాటు విమర్శలు చేశారు. ఇదే సమయంలో అదానీ అంశంపై కూడా కిషన్ రెడ్డి స్పందించారు. అదానీ అంశంలో అమెరికా మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అక్కడ ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు. అదానీపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. కొన్ని శక్తులు కుట్ర పూరితంగా ఈ ఆరోపణలు చేస్తున్నాయి. మా దేశంపై ఎలా ఆరోపణలు చేస్తారు. పార్లమెంటు సమావేశాలకు ముందుగానే ఎందుకు ఆరోపణలు వస్తున్నాయి అంటూ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

## వికలాంగుల స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క

చాటిన దీప్తి గురించి ప్రస్తావించారు. శివసేన రెడ్డి ప్రత్యేక చొరవతో సీఎం దృష్టికి తీసుకువెళ్ళి దీప్తికి వరంగల్‌లో ఐదు వందల గజాల ఇంటి స్థలం కోటి రూపాయలను ప్రభుత్వం తరపున అందించినట్లు తెలిపారు. నెల రోజుల్లో గ్రూప్ 2 ఉద్యోగం కూడా ప్రభుత్వం ఇవ్వనుందని స్పష్టం చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ తమకు ఉన్న వైకల్యాన్ని దురదృష్టంగా భావించకుండా మనలోని ప్రతిభతో పట్టుదలగా ప్రయత్నం చేయాలని డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందామని తెలిపారు. వైకల్యం ఉన్నంత మాత్రన ఎక్కడా కూడా మనం తక్కువ కాదని నిరూపించిన వనిత దీప్తి అని కొనియాడారు. ఓటములు అనేక గుణ పాఠాలు నేర్పుతాయని ఓటమితో కుంగిపోవద్దని గెలవగానే నన్ను మించిన వాళ్ళు ఎవరూ లేరని పొంగిపోవద్దన్నారు. 33 జిల్లాల నుంచి అధికారులు మిమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చి ఈ పోటీలను ఘనంగా నిర్వహిస్తున్నారని ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్ళాలని ఈ క్రీడల్లో పాల్గొంటున్న అందరికీ నా ఆల్ ది బెస్ట్ అంటూ మంత్రి సీతక్క తన సమావేశాన్ని ముగించారు.

## తెలంగాణ మంత్రుల భేటీపై మోదీ తెలుగులో ట్వీట్

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ దుష్టపాలన వల్ల కలిగిన భయంకరమైన జ్ఞాపకాలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంతో ఆశతో బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భాజపా తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉంటుందన్నారు. బీజేపీ కార్యకర్తలు తమ అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారన్నారు.

### అధికారమే లక్ష్యంగా పని చేయండి

బుధవారం తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల బృందంతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. రేవంత్ రెడ్డి పాలన, కేంద్ర పథకాల అమలు గురించి వివరాలు అడిగారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో మెరుగైన ఫలితాలు వచ్చాయని అదే ఉత్సాహంతో అధికారమే లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఇప్పుడు బీజేపీకి అనుకూలమైన వాతావరణం ఉందని కలిసి కట్టుగా పని చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. మహారాష్ట్రలో విజయం తర్వాత జోష్ మీద ఉన్న బీజేపీ హైకమాండ్ నెక్స్ తెలంగాణపై ఫోకస్ పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే మోదీ నేరుగా ఈ రోజు తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం అయ్యారన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురుకుల బాట కార్యక్రమం

మొదటి పేజీ తరువాయి

సర్కార్ సంక్షోభంలోకి నెట్టింది. 11 నెలల్లో 48 మంది విద్యార్థుల మరణించారు. రేవంత్ పాలనలో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు చోటు చేసుకున్నాయి. పాలన గాలికొదిలేసిన ముఖ్యమంత్రి నేరపూరిత నిర్లక్ష్యంతో విద్యార్థులను పొట్టన పెట్టుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు. ముఖ్యమంత్రికి ఢిల్లీకి తిరిగేందుకు సమయం సరిపోతలేదు. విద్యార్థులు చనిపోతున్న ఒక్క సమీక్ష కూడా నిర్వహించనీ ప్రభుత్వానికి ఉసురు తప్పదు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరపున ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ నెల 30 వ తేదీ నుంచి 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల బాట కార్యక్రమం కొనసాగనుందని.. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ నివేదికను పార్టీకి సమర్పిస్తుందని ఈ నివేదిక అంశాలను అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతామని పత్రికా ప్రకటనలో తెలిపారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# జమిలీకి వరుస క్లియరెన్స్ లు

వన్ నేషన్ – వన్ ఎలక్షన్ విధానం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ కూటమికి మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు బాగా కలసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఫలితాలు వేరేగా వచ్చి ఉంటే ఎన్డీఏ కూటమి కొంత బలహీనంగా కనిపించేది. ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ధైర్యంగా ముందడుగు వేయడానికి అవసరమైన నైతిక బలం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విజయం ఇచ్చిందని అనుకోవచ్చు. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కోసం కేంద్రం ఇప్పటికే దాదాపుగా అన్ని లాంఛనాలు పూర్తి చేసింది. బిల్లును పార్లమెంట్ లో పెట్టి ఆమోదించడమే మిగిలింది. అయితే ఇందు కోసం కనీసం ఎనిమిది రాజ్యాంగసవరణలు చేయాలని నిపుణులు సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. రాజ్యాంగసవరణ జరగాలంటే రెండు సభల్లోనూ మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. విడివిడిగా సభలు నిర్వహిస్తే మూడింట రెండు వంతుల మెజార్టీ కష్టం అందుకే ఉభయసభల సంయుక్త సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే జమిలీ ఎన్నికలకు అవసరమైన రాజ్యాంగసవరణలు పూర్తిచేసే అవకాశం ఉంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకపోవడం మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతూండటంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై బీజేపీ వెనక్కి తగ్గుతుందని అనుకున్నారు. కానీ ఈ విషయంలో వారి ప్లాన్లు వారిక ?ఉన్నాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల కారణంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. జమిలీ ఎన్నికలకు మెజార్టీ పార్టీలు అనుకూలంగా ఉన్నాయి. అయితే కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉంది. ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటే మరిన్ని పార్టీలు అంగీకారం తెలిపే అవకాశం ఉంది. హర్యానాలో ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని సర్వేలు చెప్పాయి. అయినా కాంగ్రెస్ విజయం సాధించలేదు. మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమికి పెద్దగా సీట్లు రాలేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆ కూటమి స్వీప్ చేసింది. అంటే కాంగ్రె?స కూటమి ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మల్చుకోవడంలో విఫలమవుతోంది. బీజేపీకి అదే ప్లస్ పాయింట్ గా మారుతోంది. పార్లమెంట్ లోనూ కాంగ్రెస్ నాయకత్వంలో పని చేసేందుకు మిత్రపార్టీలు కూడా వెనుకడుగు వేసే అవకాశం ఉంది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన తుది నివేదికను కేంద్రానికి అప్పగించినప్పట్నించి ఎప్పుడు జమిలి ఎన్నికలుంటాయా అనే చర్చ నడుస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా జమిలి ఎన్నికలు నిర్వహించే దిశగానే అడుగులు వేస్తోంది. జమిలి ఎన్నికల్లో భాగంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధమౌతోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ జమిలీ ఎన్నికలో అధ్యయనం చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. జమిలి ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలో మొత్తం 5 ఆర్టికల్స్ సవరించాలని తెలిపింది. ఇందులో భాగంగా ఆర్టికల్ 83, 85, 172, 174, 356 సవరించాల్సి ఉంది. ఈ బిల్లులు పార్లమెంట్ ఉభయసభల్లో మూడోవంతు అంటే 67 శాతం మద్దతు ఇవ్వాలి. దాంతోపాటు కనీసం 14 రాష్ట్రాలు ఓకే అనాలి. అప్పుడే ఈ బిల్లు ఆమోదం పొంది జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుంటుంది. ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టవచ్చు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం లభిస్తే 2027 యూపీ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించవచ్చు. ఆ తరువాత కొద్దిరోజుల వ్యవధిలో మున్సిపల్, కార్పొరేషన్, గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపవచ్చు. ఇప్పటికే జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సహా పలువురు స్పందించారు. త్వరలోనే జమిలి ఎన్నికలుంటాయని సంకేతాలిచ్చారు. అయితే ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా, జమ్ము కశ్మీర్ సహా ఇతర రాష్ట్రాలు 2–3 ఏళ్లు ముందుగానే అసెంబ్లీ రద్దు చేసుకుని ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అటు కాంగ్రెస్ సైతం జమిలి ఎన్నికలకు అంగీకరించడంతో ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని తెలుస్తోంది. రాజ్యాంగంలో అనేక సవరణలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాల నుంచి సమ్మతి తీసుకోవాలి. రాష్ట్ర అసెంబ్లీలను రద్దు చేయాలి' అని అన్నారాయన."ఈ అంశం ఇంతకుముందూ లేవనెత్తారు. రాజ్యాంగ సవరణ ద్వా?రానే ఇది సాధ్యమవుతుంది" అని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు. మరోవైపు 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' సాధ్యమేనని, అన్ని అసెంబ్లీలను రద్దు చేయాల్సిన అవసరం లేదని సీనియర్ జర్నలిస్ట్ ప్రదీప్ సింగ్ అంటున్నారు. రాజ్యాంగాన్ని సవరించాలంటే ఉభయ సభలలో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి. ప్రభుత్వానికి లోక్‌సభలో మెజారిటీ ఉంది. రాజ్యసభలో మెజారిటీకి ప్రయత్నించవచ్చు" అని అన్నారు ప్రదీప్ సింగ్. 14 రాష్ట్రాల ఆమోదం అవసరం. అదేం పెద్ద కష్టం కాదు. బీజేపీ దాని మిత్రపక్షాలకు 12 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లాంటి రెండు–మూడు రాష్ట్రాలు కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నాయి" అని ప్రదీప్ సింగ్ గుర్తుచేస్తున్నారు. లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతాయి కాబట్టి జమిలీ ఎన్నికలు సాధ్యమే. అయితే, రాజ్యసభకు ఇది సమస్య కావచ్చని ప్రదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

మరోవైపు కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోతే రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం కూడా కష్టమే" అని ఆయన అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పరిగణనలోకి తీసుకున్నా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు చేస్తాయా అనే సందేహం కూడా ఉంది. ఇంతకుముందు ఈ విషయంలో రెండు ప్రతిపాదనలు వచ్చాయి. రెండు దశల్లో ఎన్నికలు జరపడం మొదటిది. దీనిలో భాగంగా లోక్‌సభ ఎన్నికలకు కొన్నినెలల ముందు, తరువాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం. రెండోది బీజేపీ దాని మిత్రపక్షాల రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలను వాటంతటవే రద్దు చేయడం. అనంతరం మిగిలిన రాష్ట్రాల ప్రభుత్వాలను కేంద్రం రద్దు చేయడం. కానీ ఇందులో న్యాయపరమైన చిక్కులున్నాయి" అని చెబుతున్నారు ప్రదీప్ సింగ్.

# క్షయ వ్యాధి నియంత్రణలో రాష్ట్ర స్థాయిలో జిల్లా 32వ స్థానం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): క్షయ వ్యాధి నియంత్రణ చర్యల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాష్ట్ర స్థాయిలో 32వ స్థానంలో ఉన్నదని దీనిని ఇంప్రూవ్ చేయాలని జిల్లా వైద్యాధికారి డా.మధుసూదన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో క్షయ వ్యాధి నియంత్రణ చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లుమొగుళ్ళపల్లి అంబటిపల్లి, భూపాల్ పల్లి, వెలిశాల, ఒడితలలో క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన టార్గెట్ సాధించాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణలో స్పూటం పరీక్ష ముఖ్యమని స్పూటం సేకరణలో క్వాలిటీ అండ్ క్వాంటిటీ మెయింటైన్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. డిసెంబర్ 2వ తేదీ నుండి లెప్రసీ ప్రోగ్రాం ప్రారంభం అవుతుందని, ప్రతి ఇంటిని సందర్శించి మొద్దు బారిన, స్పర్శ లేని మచ్చలున్న వ్యక్తులను గుర్తించి పరీక్షలు చేయాలని తెలిపారు. క్షయ లక్షణాలున్నట్లు గుర్తించిన వ్యక్తులకు తక్షణమే వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్ కుమార్, డెమో శ్రీదేవి, ఏపీ ఎం ఓ, పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్లు, ఎస్ టి ఎస్ లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రం లోని డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్లో నవంబర్ 29న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్ లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణపై అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా నవంబర్ 29న రాష్ట్రం నుంచి ప్రజా ప్రభుత్వం పిలిచింది పేరుతో అంతడుపుల నాగరాజు సారథ్యంలో ములుగు జిల్లా కు విచ్చేసి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సర కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు చేయడం జరుగుతుందని అన్నారు. 29న జిల్లా కేంద్రంలోనీ డి ఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు మధ్యాహ్నం 3.00 గంటల నుండి ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారని అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఎర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణినీ, ఎం అండ్ హెచ్ ఓ ఎన్. గోపాల్ రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాష్, డి డబ్ల్యు ఓ శిరీష, ఎస్సీ కార్పొరేషన్ అధికారి తుల రవి, డి పి ఆర్ ఓ రఫీక్, ములుగు ఎమ్మార్వో విజయభాస్కర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# నవంబర్ 29 దీక్ష దివాస్ విజయవంతం చేయండి

## రాబందుల చేతుల్లో తెలంగాణ దగా పడుతుంది కాముని శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు



చిన్నకోడూర్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోస్తే తెలంగాణ ద్రోహుల కబంధహస్తాలలో తెలంగాణ విలువిలలాడుతుందని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. బుధవారం నాడు చిన్నకోడూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ ములకల కనకరాజు' బిఆర్ఎస్ పార్టీ జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య తో కలిసి మాట్లాడుతూ నవంబర్ 29న సిద్దిపేటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో తెలంగాణ దీక్ష దివాస్ కార్యక్రమం జరగనుందని ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి జిల్లాలోని ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు హాజరు కనున్నారని కావున జిల్లాలోని పార్టీ ప్రముఖులు సీనియర్ నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు పిఎసిఎస్ చైర్మన్లు గ్రామ శాఖ అధ్యక్షులు హాజరై విజయవంతం చేయాలని కోరారు 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడు అనే నినాదంతో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకొని మరిదశ ఉద్యమాన్ని ప్రారంభించి సకల జనులను కూడగట్టి ఉద్యమం చేసి తెలంగాణ సాధిస్తే నాడు తెలంగాణ వద్దని ఏకే 47లతో తెలంగాణ ఉద్యమకారులను భయభ్రాంతులకు గురిచేసిన అటువంటి కుటిల నాయకుని చేతిలో తెలంగాణ ఈరోజు విలవిలలాడుతుందని తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉద్యమకారులను పైన ఉందని ఇలానే చూస్తూ ఊరుకుంటే తెలంగాణ మిగలదని తెలంగాణ రాష్ట్రాన్ని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిన్నాభిన్నం చేస్తున్నాడని ఈ దీక్ష దివాస్ రేవంత్ రెడ్డికి చెంపపెట్టు కావాలని వారన్నారు ఇట్టి కార్యక్రమంలో కాముని శ్రీనివాస్, ములకల కనకరాజు, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, కీసరి పాపయ్య, ఇట్టబోయిన శ్రీనివాస్ ఏంరెడ్డి భూమిరెడ్డి, కాల్వ ఎల్లయ్య, పంపరి కనకయ్య, గుజ్జ రాజు, కుమార్ తదితరులు ఉన్నారు

# బిఫార్మసీ కోర్సులో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): అనంతారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా ఫార్మసీ కళాశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి బిఫార్మసీ కోర్సులో మిగిలిపోయిన సీట్లకు ఆసక్తిగల విద్యార్థినులు దరఖాస్తు చేసుకొనవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. స్వప్నా రెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. TGEAPCCT 2024 లో క్వాలిఫై అయిన విద్యార్థినులు తేదీ. 09-12–2024 న ఉదయం 10 గంలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు ర్యాంకు కార్డుతో స్వయంగా స్పాట్ అడ్మిషన్ కు కళాశాల యందు హాజరవ్వగలరని మిగిలిపోయిన ఖాళీల వివరాలు కళాశాల నోటీసు బోర్డుపై ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థినుల ఎంపిక TGEAPCET - B, 2024 ర్యాంకు మరియు వర్గాల వారి ఖాళీల ఆధారంగా చేయబడునని అన్నారు. సీట్లు కేటాయించబడిన విద్యార్థినులు ప్రాసెసింగ్ రుసుము చెల్లించవలసి ఉంటుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కళాశాల ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

## – అదనపు కలెక్టర్ వేణుగోపాల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలు, మండల కేంద్రాల పరిధిలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులను నమ్మి, అమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అధికంగా లభిస్తుంది తెలిపారు. రైతులు పండించిన తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని పేర్కొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యంలో చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని, ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): మహాముత్తారం మండలంలోని కొనంపేట, మహా ముత్తారం మండలంలోని మీనాజిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించేందుకు ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలను ఆదేశించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, సమయానికి పంట కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం ట్యాగ్ చేసిన మిల్లులకు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, వ్యవసాయ అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు.

# దీక్ష దివస్ కు పోలీసులు అనుమతి ఇస్తలేరు

కరీంనగర్: కరీంనగర్ లో దీక్ష దివస్ పై బిఆర్ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్ తదితరులు హజరయ్యారు. మాజీమంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసిఆర్ అరెస్టు అయిన 29న అలుగునూరులో దీక్షా ధివస్ నిర్వహిస్తాం. దీక్షా దీవస్ కేటీఆర్ హాజరు కానున్నారు. దీక్ష దివస్ కు పోలీసులు అనుమతి ఇస్తలేరు. అనుమతి కోసం పోలీసుల దగ్గరికి మళ్ళీ వెళ్తాం. రాజకీయ కార్యక్రమం కాదు, తెలంగాణ ఆత్మ గౌరవ దీక్ష ఇది. తెలంగాణ సాధించు కోవడానికి మరో సారి గజ్జె కట్టాలి. ఎవరు ఆపిన దీక్ష ధివాస్ ఆగదు... అలుగునూర్ చౌరస్తా లోనే జరుగుతుందని అన్నారు. వేలా సంఖ్యలో దీక్ష దీవస్ కు బిఆర్ఏస్ కార్యకర్తలు హాజరు అవుతారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆరు గ్యారెంటీ లు ఇచ్చే వరకు వదిలి పెట్టే ప్రసక్తి లేదు. బీసీ డిక్లరేషన్ ఏమైంది? పార్టీ వీడి కాంగ్రెస్ కు వెళ్ళిన వాళ్ళు నేడు గోస పడుతున్నారు. క్యాడర్ ను తయారు చేసే దమ్ము బిఆర్ఎస్ పార్టీ కి ఉందని గంగుల కమలాకర్ అన్నారు.

# కొత్త పాన్ కార్డుకు క్యాబినెట్ ఆమోదం!

న్యూఢిల్లీ నవంబర్ 27: ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్ 'పాన్ 2.0' కార్డును ప్రవేశపెట్టబోతున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఈ ప్రకటనతో పౌరులు తాము మళ్లీ కొత్త పాన్ కార్డుకు అప్లయ్ చేయాలా? అని ఆలోచిస్తున్నారు. కానీ అలా చేయనవసరం లేదు. మీ ప్రస్తుత పాన్ కార్డు చెల్లుబాటవుతుంది. సిస్టం డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ కోసం ఈ 'పాన్ కార్డు 2.0' ను తేబోతున్నారు. కేంద్ర మంత్రి వైష్ణవ్ కొత్త పాన్ కార్డులను ప్రవేశపెడుతున్నామని ప్రకటించినప్పుడు పాన్ కార్డుకు 'క్యూఆర్ కోడ్' ను అప్ గ్రేడ్ చేస్తామన్నారు. ప్రభుత్వం తాలూకు 'డిజిటల్ ఇండియా విజన్' కు అనుగుణంగా ఈ కొత్త క్యూఆర్ పాన్ కార్డును ప్రవేశపెట్టబోతున్నారు. దీని ద్వారా 'పాన్'ను కామన్ బిజినెస్ ఐడెంటిఫయ్యర్ గా చేయబోతున్నారు. ఇప్పటికే దేశంలో 78 కోట్ల పాన్ కార్డులు ఉన్నాయి. అందులో వ్యక్తిగతమైనవి (ఇండివ్యుడ్యుయల్స్ వి) 98 శాతం

# డయాలసిస్ సేవలు సద్వినియోగం చేసుకోండి

## –మెడికల్ సూపరెండెంట్ రాజశేఖర్

మంథని: మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ సూపరెండెంట్ రాజశేఖర్ కోరారు. డయాలసిస్ కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా మంథనిలోనే రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆగస్టు నెలలో ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. సింగిల్ యూసెజ్ ఫిల్టర్ ద్వారారోగులకు డయాలసిస్ సేవలు అందిస్తున్నామన్నారు. డయాలసిస్ సేవలు అందుకుంటున్న రోగుల సంఖ్య ఆధారంగా అవసరమైన పరికరాల స్టాక్ ముందస్తుగా అందు బాటులో ఉంచుతున్నామని మెడికల్ సూపర్డెంట్ రాజశేఖర్ తెలిపారు.

# విద్యార్ధులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

హైదరాబాద్: సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నాడు ఎన్ ఎస్ ఎస్ విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి చంపా పేట చౌరస్తాలో ట్రాఫిక్ నియమాలపై ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. హెల్మెట్ ధరించాలని, మైనర్లు డ్రైవ్ చేయకూడదని, సీటు బెల్టు పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లకూడదని పోలీసులు సూచించారు. చిన్న చిన్న నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే విలువైన ప్రాణాల్ని పోగొట్టుకోవాల్సి వస్తోందని ఇన్స్పెక్టర్ నర్సింహ నాయక్ తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు సత్యనారాయణ. వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు

# వరి నుండి పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్ సాగు చేయాలి

**– ఆయిల్ పామ్ గెలలు ఒక టన్నుకు రూ.19,144/–**





మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న సాగులో వున్న ఆయిల్ పామ్, మిరప, బంతి, చామంతి, మామిడి, కూరగాయ తోటలను కాంపల్లి, ఉప్పరిగూడెం, మోదుగులగూడెం, నేరడ, జంగిలిగొండ, తదితర గ్రామాలను సందర్శించి పంటలలో తీసుకోవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. నేరడ లో వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి, జిల్లా కలెక్టర్ ఆదేశాలు ప్రకారం ధ్యానం కొనుగోలు చేయాలని తెలిపారు. ఉద్యాన పంటల సాగు లాభదాయకం – పంట మార్పిడితో అధిక ఆదాయం–పండ్ల తోటలలో అంతర పంటలుగా కూరగాయల సాగు : మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలంచుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలి. కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేస్లలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ క్షేత్ర సందర్శనలో రైతులు %ఖ%. ప్రభాకర్ రెడ్డి, %చీ%. రంజిత్ రెడ్డి, కళ్యాణ్, చందు, మైక్రో ఇరిగేషన్ ఇంజనీర్ %ణ%. రాజా కిషోర్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ %దీ%.నాగరాజు, బిందు సేద్య అధికారులు %+%. శరత్, %వీ%. అశోక్, %ణ%. అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- జిల్లా అధికారులకు మంత్రి పొంగులేటి స్వీట్ వార్నింగ్
- పలు శాఖల అధికారుల పనితీరు పై ఫిర్యాదులు
- పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరిక
- అధికారులను అడిషనల్ కలెక్టర్ సమన్వయం చేసుకోవాలి
- జిల్లా అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షా సమావేశం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొత్తగూడెం జిల్లా అధికారులపై ఫైర్ అయ్యారు. కొత్తగూడెం జిల్లా పర్యటనకు బుధవారం వచ్చిన ఆయన అప్పటికప్పుడు పలు శాఖల అధికారులతో చుంచుపల్లిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వేటు తప్పదని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయన్నారు. పలు శాఖల అధికారులపై ఫిర్యాదులొస్తున్నాయని, అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులు నిర్వీర్యం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చింద వాటిని మంచి పనులకు వినియోగించాలని లేకపోతే శాఖపరమైన చర్యలుంటాయని సీపీవోను హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో జరిగే రోడ్డు అభివృద్ధి పనులకు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను అలస్యం లేకుండా పొంది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఈలకు సూచించారు. గ్రామాల్లో పనిచేసే పంచాయతీ సెక్రటరీలు నివాసం ఓ చోట విధులు మరో చోట నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల్లో వారికి పట్టు ఉండటం లేదని వెంటనే ఆయా గ్రామాల సెక్రటరీలు వారు పనిచేస్తున్న గ్రామాలకు నివాసం మారాలని సూచించారు. వారిపై డీపీవో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీరు ఇతరత్రా సమస్యలేవీ లేకుండా చూడాలన్నారు. అలాగే జిల్లాలోని పలు మండలాల్లో ఎమ్మార్వోలపై వరుస ఫిర్యాదులందు తున్నాయని తెలిపారు. ఎమ్మార్వోలను పర్యవేక్షించే బాధ్యత ఆర్ డీ వో లదేనని సూచించారు. వారి పనితీరు ఎప్పటికప్పుడు తనకు అప్ డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. వాటి ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో మెరుగైన పనితీరు కోసం ఒక్కరికే రూ.50లక్షల ఆ పై టెండర్లు ఇవ్వాలన్నారు. తద్వారా అతని పై ఒత్తిడి పెంచి పనిని త్వరగా పూర్తి చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్ డ బ్ల్యూఎస్ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని, ఆకస్మిక తనిఖీ చేస్తానని నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గమనిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పరిపాలన సజావుగా సాగేందుకు లోకల్ బాడీస్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకోని విధులు నిర్వర్తించాలన్నారు.లి

# రైతు సదస్సు ను విజయవంతం చేద్దాం

**– కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వినయ్ కుమార్ రెడ్డి**



ఆత్మకూర్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే రైతు సదస్సుకు రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి రైతు సదస్సును విజయవంతం చేయాలని ఆత్మకూరు మండల కిసాన్ సెల్ మండల అధ్యక్షులు వి వినయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాత సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ ఉద్యానవన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 150 స్టాళ్లతో వివిధ రకాలను వ్యవసాయ ఉత్పత్తుల ఏర్పాటు చేసిన ప్రదర్శన ఇస్తారు ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు జిల్లా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. కావున రైతులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి రైతు సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు.

# భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం

**హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**





హనుమకొండ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రకాళి చెరువులో చేపట్టిన పూడికతీత పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులకు సంబంధించిన వివరాలను సాగునీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. పూడికతీత పనులకు సంబంధించి సాగునీటి పారుదల, రెవెన్యూ, కుడా, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పనులకు సంబంధించి సర్వే చేసి దేనికి ఎంత ఖర్చవుతుందనే వాస్తవ అంచనాలను తయారు చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పూడిక తీసిన మట్టిని డంపింగ్ చేసేందుకు స్థలాలను గుర్తించాలని ఆర్డీవోలను ఆదేశించారు. చెరువు మట్టి కావాలని దరఖాస్తు చేసుకున్న ప్రజలతో అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కుడా అధికారులు మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ సీఈ అశోక్ కుమార్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారాం, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**– మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్**





ఆత్మకూర్, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురయ్యారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆ పాఠశాలను ఎక్కడ సందర్శి స్తారని అనుమానంతో పోలీసులు ముందస్తుగా చిట్టెం రామ్మోహన్ రెడ్డిని అరెస్టు చేయడం సిగ్గుచేటని కార్యకర్తలు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు. దీంతో పట్టణ కేంద్రంలో గంటపాటు రాకపోకలు వాహనాలు నిలిచిపోయాయి. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఆత్మకూర్ పోలీస్ శాఖ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, ఆత్మకూరు మండలం మాజీ ఎంపీపీ ఎంపీ రామన్ స్కూల్ అధినేత మొగిలి శ్రీధర్ గౌడ్, ఆత్మకూరు మండలం బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎం.రవికుమార్ యాదవ్, రేచేతల సింగిల్ విండో అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు మండ్ల రామకృష్ణ, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పిన్నంచర్ల మాసన్న,జానకి రాములు, సోంబాబు, అనిల్ రాజ్ కిరణ్,మాజీ వార్డ్ మెంబర్ కొత్త బోయ శేఖర్, రామకృష్ణ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పండుగ, తెలంగాణ పండుగ

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం నవంబర్ 30న మహబూబ్నగర్లో రైతు పండుగ మన పండుగ, తెలంగాణ పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ మంత్రి ఇతర క్యాబినెట్ మంత్రులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలోని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో 150 స్టాల్స్ ఏర్పాటు చేస్తారని వ్యవసాయ పరికరాలు, సౌర పంపులు, స్థానిక సాంకేతికతలు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు ప్రదర్శన ఉంటాయని అలాగే వ్యవసాయ డ్రోన్ల ప్రదర్శన, ఆవిష్కర ణాత్మక వ్యవసాయ పరికరాలు, తేనెటీగలు, పట్టుపురుగుల పెంపకం గురించి ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తారన్నారు. వ్యవసాయం కాకుండా 25 ఇతర విభాగాలకు చెందిన స్టాల్స్,ఔషధ మొక్కలు, సుగంధ మొక్కలు, వివిధ రకాల కూరగాయలు, పుష్పాలు, విత్తనాలు, విలువ జోడించబడిన ఉత్పత్తులతో స్టాల్స్ కూడా ఉంటాయన్నారు. ఈ స్టాల్స్లో మశ్రూమ్ల పెంపకం, చేపల పెంపకం ఇతర వ్యవసాయ, మత్స్య సంపద సంబంధిత అంశాలపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. మన జిల్లాలో సన్న ధాన్యాన్నీ కొనుగోలు చేసి బోనస్ రూపంలో 1044 మంది రైతులకు 2.16 కోట్ల రూపాయలు వారి ఖాతాల్లో నగదు జమ చేశామన్నారు. జిల్లాలో 54458 మంది రైతులకు రూ. 469.32 కోట్ల విలువైన పంట ఋణ మాఫీ ప్రయోజనం లభించిందన్నారు


# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**– వసతి గృహాల తనిఖీచేసిన అధికారులతో సమీక్షించిన కలెక్టర్**



వరంగల్ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ వసతి గృహాలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాలు తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా నియమించిన 46 మంది జిల్లాస్థాయి అధికారులు తాసిల్దార్లు ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో రెండు రోజులపాటు విస్తృతంగా తనిఖీలు చేసి అక్కడి పరిస్థితులపై అధికారులు నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించిన మేరకు తనిఖీ చేసి అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నివేదిక ఆధారంగా సక్రమంగా నిర్వహణ జరగని సంబంధిత సంక్షేమ వసతి గృహం, ప్రభుత్వ విద్యా సంస్థలు, పాఠశాలల బాధ్యులు, అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అధికారులు తరచుగా ఆయా మండలాలలోని వసతి గృహాలకు ప్రభుత్వ విద్యా సంస్థలకు ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో ఇన్చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు, తనిఖీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**–జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ జిల్లా, నవంబర్ 27 (తీన్మార్ న్యూస్): బుధవారం, బాలల పరిరక్షణ విభాగం, స్కోప్ ఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహ రహిత భారత్ క్యాంపెయినింగ్ లో భాగంగా బాల్ వివాహ్ విముక్త్ భారత్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలబాలికలకు వివాహం చేయడం వల్ల వారి భవిష్యత్ కు ఆటంకం కలుగుతుందని బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకొని జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బాల్య వివాహ నిర్మూలన జిల్లాగా మార్చాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేయడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098లో సంప్రదించాలని కోరారు. అలాగే సమాచారం తెలిపిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, సిడబ్ల్యూసీ చైర్ పర్సన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎల్. రవికాంత్, పీఓఐసీ స్వప్నారాణి, చైల్డ్ లైన్ కో–ఆర్డినేటర్ రవి కుమార్, స్కోప్ ఎన్జీవో కో–ఆర్డినేటర్ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# మాలల సింహాగర్జన విజయవంతం చేయాలి

**– తాడిచెర్లలో సింహగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరణ**



మల్హర్ రావు : డిసెంబర్ 1న హలో మాల.. చలో హైదరాబాద్ లో నిర్వహించే మాలల సింహగర్జన సమావేశాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు మంథని నియోజకవర్గ కన్వీనర్ నూకల బాంయ్య, కో కన్వీనర్ బండి రాజయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర కో కన్వీనర్ నల్లాల కానక రాజు, ,కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రమైన తాడిచెర్లలో మాల సింహగర్జన వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి హలో మాల%ౌ%చలో హైదరాబాద్ మాలల సింహ గర్జన డిసెంబర్ 1న పరేడ్ గ్రౌండ్ సికింద్రాబాద్ లో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించడం జరుగుతుందని,ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మాలలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కో కన్వీనర్ మండల రాహుల్,మండల కన్వీనర్ పసుల పోచయ్య, కో కన్వీనర్ నార రమేష్, బండి స్వామి, రావుల అంజనేయులు,.బండి సుధాకర్,బండి రనధీర్ రావు.

మహిళా విభాగం మండల కన్వీనర్ రావుల కల్పన మొగిలి,రావుల నిర్మల,జంజేర్ల స్వరూప.,దండు కల్పన,కాలువ దేవక్క.,వెల్పల రస్న, జంజేర్ల లక్ష్మి,బానాల సాగర్, జంజేర్ల ప్రశాంత్,దండు నరేష్.,కాలువ నరేష్.,బండి పవన్, జంజేర్ల సాయి.,రావుల శేషి, ఏకుల దీలీప్., జంజేర్ల సంపత్, జంజేర్ల శ్రీనివాస్.,కొండ మదు, దండు సమ్మయ్య,నవీన్,మల్లేష్ పాల్గొన్నారు.

# రోగసీ కోసం వచ్చిన మహిళ ఆత్మహత్య




హైదరాబాద్: సరోగసీ కోసం వచ్చిన మహిళపై ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడంతో ఆమె భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని రాయదుర్గంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం మై హోమ్ భూజా అపార్ట్‌మెంట్స్ 9వ అంతస్తులో రాజేశ్‌బాబు (54) నివసిస్తున్నారు. సందీప్ అనే వ్యక్తి ద్వారా గత నెల 24న ఒడిశా నుంచి ఓ మహిళను సరోగసీ కోసం తీసుకొచ్చారు. నెలరోజులుగా ఆమెను బయటకు వెళ్లనీయకుండా రాజేశ్ తన ఫ్లాట్‌లోనే నిర్బంధించాడు. మహిళ వెంట వచ్చిన ఆమె భర్తకు అదే అపార్ట్‌మెంట్‌లో మరో ఫ్లాట్ కేటాయించాడు.

ఈ క్రమంలో సదరు మహిళపై రాజేశ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కనీసం భర్తతో కూడా మాట్లాడనివ్వకుండా దూరంగా ఉంచాడు. రాజేశ్ వేధింపులు భరించలేక సోమవారం అర్ధరాత్రి ఆమె ఆ భవనం పైనుంచి కిందికి దూకి మృతిచెందింది. మహిళ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# ఒక్కరి కోసమే బడి

**– ఆ స్టూడెంట్ రాకపోతే అందరూ ఖాళీనే..!**
**– ఒక్క విద్యార్థిని కోసం ప్రత్యేకంగా టీచర్‌ను కేటాయించిన ప్రభుత్వం**
**– వంట మనిషి, పారిశుధ్య కార్మికురాలిని కూడా%ౌ**
**– వైరా మండలం నారపనేనిపల్లి పాఠశాల తీరు**




ఖమ్మం: ఖమ్మం జిల్లా వైరా మండలం నారపనేనిపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. చాలా సంవత్సరాల క్రితం స్కూల్ ప్రారంభమైంది. గతంలో విద్యార్థులు ఉన్నా ఈ ఏడాది ఒక్కరే ఉ ండటం గమనార్హం. ఇక్కడ 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యా బోధన చేస్తుంటారు. ఈ పాఠశాలలో ఇదే గ్రామానికి చెందిన ఒకే ఒక్క విద్యార్థిని కీర్తన 4వ తరగతి చదువుతోంది. ఈ ఒక్క విద్యార్థిని కోసం ప్రభుత్వం ఒక టీచర్‌ను నియమించింది. ఆ టీచర్‌కు నెల వారీ వేతనం రూ.1,01,167 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ఏడాదికి ఆ మొత్తం రూ. 12.14 లక్షలు అవుతుంది. ఈ విద్యార్థినికి వంట వండేందుకు ప్రభుత్వం వంట మనిషికి నెలకు రూ. 3,000 చొప్పున 10 నెలలకు రూ.30వేలు చెల్లిస్తుంది. పారిశుద్ధ్య కార్మికురాలికి కూడా నెలకు రూ.3,000 చొప్పున 10 నెలలకు రూ.30 వేలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం స్కూల్ నిర్వహణ గ్రాంట్ కింద రూ.5,000, స్పోర్ట్స్ గ్రాంట్ కింద మరో రూ. 5,000 మంజూరవుతున్నాయి. ఇవన్నీ కలిపి ఈ ఒక్క విద్యార్థినిపై ప్రభుత్వం ఒక్క విద్యా సంవత్సరానికి సుమారు రూ.12.84 లక్షలు ఖర్చు చేస్తోంది.

**ఆమె రాకపోతే అందరూ ఖాళీనే..!**

ఆ విద్యార్థిని దాదాపు ప్రతిరోజూ స్కూల్‌కు వస్తుంది. కానీ అనివార్య పరిస్థితిల్లో ఆమె ఏ రోజైనా సెలవు తీసుకుంటే టీచర్ సహా మిగిలిన సిబ్బంది ఖాళీగా ఉండాల్సి వస్తుంది. వాస్తవానికి ఈ గ్రామంలో 20 మంది వరకూ విద్యార్థులు ఉండేవారు. అయితే ప్రభుత్వ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ సౌకర్యం లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రయివేటు పాఠశాలకు ఆ పిల్లలను పంపుతున్నారు. కొందరు గురుకుల పాఠశాలలకు వెళ్లిపోయారు. గతేడాది ఆరుగురు ఉంటే ఈ సంవత్సరం కీర్తన ఒక్కతే మిగిలింది. కాబట్టి పాఠశాలను ఎత్తివేద్దామని జిల్లా విద్యాశాఖ భావించినా ఆ విద్యార్థిని తండ్రితో పాటు గ్రామస్తులు ఒప్పుకోలేదు. తన కూతురిని ఇక్కడే చదివిస్తానని విద్యార్థిని తండ్రి తెలిపారు.

**చర్చనీయాంశంగా పాఠశాల కొనసాగింపు**

నారపనేనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కొనసాగింపు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ఒక్క విద్యార్థిని కోసం రూ. 12.84 లక్షలు ఖర్చు చేయటం ఏమిటని కొంతమంది అంటుంటే.. మరోవైపు చైనాలో ఓ విద్యార్థిని కోసం అక్కడి ప్రభుత్వం రైలునే నడిపిందని మరికొందరు అంటున్నారు. కేరళ వంటి రాష్ట్రాల్లో ఈ తరహాలో అనేక పాఠశాలలు నిర్వహిస్తుంటారని చెబుతున్నారు. మరికొందరు ప్రభుత్వ ధనం సరైన రీతిలో వినియోగించట్లేదని అభిప్రాయపడుతున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి



హైదరాబాద్: రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలనీ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ నుంచి ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని అంశాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నా యన్నారు. సన్న, దొడ్డు రకాలను వేర్వేరుగా సేకరిం చాలనీ, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలనీ, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇన్‌చార్జి మంత్రులు, ఇన్‌చార్జి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ధాన్యం కొనుగోళ్ల తీరును పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నివేదికను ప్రతిరోజు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా మిల్లులకు ధాన్యం కోసం లారీల ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. సన్నరకం పండించిన రైతులకు బోనస్‌గా రూ.500 ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలనీ, గిట్టుబాటు ధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రతి సందర్భంలో ఈ ప్రజా ప్రభుత్వం అన్ని పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలుచేసేలా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో ధాన్యం పండించారు. ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. సరిహద్దు జిల్లాల్లో నుంచి బోనస్ కోసం ధాన్యం రాష్ట్రంలోకి వస్తుంది. ఆ ధాన్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి' అని హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీన మహబూబ్ నగర్‌లో రైతు పండగను జరుపబోతున్నాం. దానిని పురస్కరించుకొని 28, 29, 30 తేదీల్లో మహబూబ్ నగర్‌లో వ్యవసాయ అనుబంధ రంగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, ఆదర్శ రైతులతో రైతు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 30న జరిగే రైతు పండుగను కలెక్టర్లు అందరు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

# అత్తాపూర్ మూసీలో విషపూరిత కెమికల్స్ డంప్

**– అర్ధరాత్రి పట్టుకున్న స్థానికులు**
**– పోలీసుల అదుపులో లారీ డ్రైవర్లు**
**– మూసీ పరిశుభ్రతపై సీఎం దృష్టి పెట్టాలి : జీహెచ్ఎంసీ విప్ తోకల శ్రీనివాస్ రెడ్డి**



రాజేంద్రనగర్: అర్ధరాత్రి దాటిన తర్వాత నిత్యం అత్తాపూర్ మూసీలో అక్రమంగా కెమికల్స్ డంపు చేస్తున్నారు. దీన్ని గమనించిన స్థానికులు నిఘా పెట్టి డంప్ చేస్తున్న లారీలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లోని మూసీ నది పక్కన స్థానికంగా ఉ న్న ఒక వ్యక్తి స్థలాన్ని కబ్జా చేసి అక్కడ ఇసుక, అక్రమంగా పార్కింగ్ నిర్వహిస్తున్నారు. అయితే కొంత కాలంగా ఆ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున దుర్వాసన రావడంతో స్థానికులు ఈ అక్రమ లారీ పార్కింగ్‌పై నిఘా పెట్టారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నగరం శివారులోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద లారీ ట్యాంకర్లు ఈ పార్కింగ్ స్థలానికి వచ్చాయి.

ఆ ట్యాంకర్‌లో నుంచి పైపులు వేసి మూసీలోకి అక్రమంగా కెమికల్ డంపు చేస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడకు చేరుకొని లారీ ట్యాంకర్స్‌ను పరిశీలించారు. విపరీతమైన దుర్వాసనతో కూడిన కెమికల్ యాసిడ్ వంటి విష వ్యర్థ పదార్థాలను ఒక ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా మూసీలోకి వదులుతున్న విషయాన్ని గమనించారు. ఎక్కడ నుంచి తీసుకొని వస్తున్నారని డ్రైవర్లను స్థానికులు ప్రశ్నించగా వారు షాద్‌నగర్, జీడిమెట్ల, బొల్లారంలోని ఫార్మా కంపెనీల నుంచి తీసుకొని వస్తున్నామని చెప్పారు. ఇక్కడ కెమికల్ డంపు చేయడానికి ఒక లారీకి రూ.25 వేలు వసూలు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్లను స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అం దించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కెమికల్ డంపును పరిశీలిచి, లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్ధవంతంగా సేవలందించాలి: ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్ల: భారత రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్ధవంతంగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నా అనంతరం జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ%ౌ%భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికి ప్రాథమిక హక్కులను కల్పించడంతో పాటు ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపరిచారని చెప్పారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ లక్ష్యాలుగా ఏర్పడిన పోలీస్ వ్య వస్థలో ఉన్న మనమంతా రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని,రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తూ దేశాభివృద్ధిలో బాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్థంభంగా నిలవడమే కాక ప్రపంచ దేశాలకు మన దేశం ఆదర్శంగా నిలవడంలో భారత రాజ్యాంగం ప్రధాన భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, సి.ఐ లు శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, ఎస్.ఐ లు కిరణ్, ఆర్.ఎస్.ఐ లు శ్రవణ్, శ్రీనివాస్,దిలీప్, పోలీస్ కార్యాలయ సిబ్బంది,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలపై హింసను అరికట్టాలి

**– ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి**
**– 'హింస వ్యతిరేక దినం'పై సెమినార్**




క్లాక్‌టవర్: మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, దానికి మద్యం, మాదకద్రవ్యాలే ప్రధాన కారణమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో మంగళవారం ఐద్వా జిల్లా అధ్యక్షులు పోలేబోయిన వరలక్ష్మి అధ్యక్షతన 'హింస వ్యతిరేక దినం'పై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో నేడు మహిళలపై అనేక రకాల హింసలు జరుగు తున్నాయన్నారు. వాటిని అరికట్టడంలో, మహిళలకు రక్షణ కల్పించ డంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగంగా మహిళలను నగంగా ఊరేగిస్తున్న సంఘటనలు, సామూహిక లైంగికదాడుల ఘటనలు తల్లిదండ్రులను భయాందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల మహిళల నిష్పత్తి తగ్గిపోతోందని చెప్పారు. ఇంకా మహిళలను రెండో పౌరులుగానే చూస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు సగౌరవంగా తలెత్తుకునే రోజు వచ్చిన నాడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని, రాజ్యాంగపు ఫలాలు ప్రతి ఒక్కరికీ అందే విధంగా పోరాటాలు చేద్దామని చెప్పారు. ప్రతి ఒక్కరూ హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా హింసకు వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన వాగ్దా నాలు అమలు చేయాలన్నారు. ప్రతి మహిళకూ 2500 రూపాయలు ఇస్తామన్న వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇంకా ఇవ్వడం లేదని, ఇందిరమ్మ ఇండ్ల పథకం అడుగు ముందుకు వేయలేదని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుంటే మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు కొండ అనురాధ, జిట్టా సరోజ, నిమ్మల పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మల పద్మ, చనబోయిన నాగమణి, సుల్తానా, మేకల వరుణ, జిల్లా కమిటీ సభ్యులు ఇందిర, కనుకుంట్ల ఉమా, కౌసల్య, జంజిరాల ఉమా,భార్గవి, పుష్ప, శశికళ, నాగమ్మ, లక్ష్మి, శీలం పద్మ పాల్గొన్నారు.

# తెలంగాణకు మరో 3 ఎయిర్ పోర్టులు

హైదరాబాద్:ప్రస్తుతం ఉన్న శంషాబాద్, బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లు కాకుండా.. మరో నాలుగు ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల వరంగల్ విషయంలో క్లారిటీ వచ్చింది. మరో 3 ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణలో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మాత్రమే ప్రస్తుతం ప్రయాణికులకు అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లో బేగంపేట ఎయిర్‌పోర్ట్ ఉన్నా.. ప్రయాణికులకు అందుబాటులో లేదు. కేవలం ప్రముఖులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి.

1.ఇటీవల జరిగిన వరంగల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వరంగల్, రామగుండం, కొత్తగూడెం, ఆదిలాబాద్‌లలో ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

2.ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు రానున్నాయి. కేంద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్ నాయుడు ఉండడంతో.. అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉంది.

3.వరంగల్ మామునూరులో నిజాం కాలంలోనే వాయుదూత్ విమానాలు నడిచేవి. ఇక్కడ విమానాశ్రయం మూతపడి 32 ఏళ్లు కావొస్తోంది. దీనికి 696.14 ఎకరాల భూమి ఉంది. మరింత భూమి కావాలని ఏఏఐ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

4.మొదటి దశలో మామునూరు విమానాశ్రయాన్ని చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. మాస్టర్ ప్లాన్ తయారీ, ఎయిర్‌పోర్టు అభివృద్ధికి 8 నెలల గడువును లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

5.రాబోయే నాలుగేళ్లలో వరంగల్ తోపాటు.. రామగుండం, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెంలలో కూడా ఎయిర్‌పోర్ట్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల్లో ఇందుకు అడుగులు పడుతున్నాయి. మూడు మండలాల పరిధిలో భూసేకరణపై అధికారులు అంచనాకు వచ్చారు.

6.రామగుండంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు త్వరలోనే అడ్డంకులు తొలిగే అవకాశాలు ఉన్నాయి. రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

7.అటు ఆదిలాబాద్‌లోనూ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. అక్కడ సుమారు 1600 ఎకరాల్లో భూమి సిద్ధంగా ఉంది. గతంలోనే ఈ విషయాన్ని ఆదిలాబాద్ జిల్లా నేతలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటుకు సానుకూల స్పందన వస్తే.. అందుకు కావాల్సిన అన్నీ సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమాచారం.

# షీ టీం తోనే మహిళలకు రక్షణ

**– షీ టీం తోనే మహిళలకు రక్షణ అని షీ టీం ఇన్చార్జి స్నేహలత అన్నారు.**

రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షి టీం ఇంచార్జ్ మల్లన్న ఆధ్వర్యంలో ఓదెల మండలం కనగర్తి లోని జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ విద్యార్థలకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. మరియు ఆకతా యిల నుండి ఎలా రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షి టీం సభ్యుడు సురేష్, భరోసా కో ఆర్డినేటర్ అశ్రీత సపోటర్ అస్మా మరియు హెడ్ మాస్టర్ రమేష్ ,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు వేగవంతం

హైదరాబాద్: తెలంగాణలోని పేదలకు అందించనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల అర్హులను ఎంపికకు ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును తెలంగాణ హైకోర్టు సమర్థించింది. ఇళ్ల అర్హుల ఎంపికకు గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడి సర్కార్ నిర్ణయించారు. అలా చేయడం చట్టవిరుద్ధమంటూ రాష్ట్ర బీజేపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇరు పక్షాల వాదనలు విని ప్రభుత్వ ఉద్దేశ్యంలో ఎలాంటి లోపాలు లేవని అభిప్రాయపడింది. ఈ మేరకు.. బీజేపీ శాసనసభా పక్షం దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది. న్యాయస్థానాలు విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమంటూ తీర్పు వెలువరించింది.కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించినట్లుగానే.. ఇప్పుడు కూడా రాష్ట్ర వ్యాప్తంగా పేదవారికి సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తిరిగి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా.. ప్రభుత్వ ప్రాథామ్యాలకు అనుగుణంగా అసలైన అర్హుల్ని ఎంపిక చేసేందుకు గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కమిటీల ఏర్పాటు అధికారాన్ని జిల్లా కలెక్టర్ కు కట్టబెడుతూ.. జీవో 33 జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన బీజేపీ శాసనసభా పక్షం, మరికొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ నగేష్.. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇందిరమ్మ కమిటీలకు అధికారులు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని వాదించిన పిటిషనర్లు.. ఎన్నికల ద్వారా ఎంపికైన గ్రామ పంచాయతీ, వార్డు సభ్యులకు చోటు లేకపోవడం సరైంది కాదని వాదించింది. గతంలో డబుల్ బెడ్ రూమ్ పథకం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేశామని, కానీ.. ఇప్పుడు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం విరుద్ధమన్నారు. పైగా ఈ కమిటీల్లోని సభ్యుల ఎంపికకు అనుసరించాల్సిన అర్హతల్ని తెలపలేదని వెల్లడించింది.పిటిషనర్ల వాదనను ఖండించిన ప్రభుత్వం తరఫున న్యాయవాదులు.. జీవో 33 ప్రకారం ఇందిరమ్మ కమిటీల్లో గ్రామస్థాయిలో సర్పంచి లేదాప్రత్యేక అధికారి, వార్డు స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్లుగా ఉండనున్నారని వెల్లడించారు. వీరికి తోడుగా.. గ్రామాల్లోని స్వయం సహాయక గ్రూపుల నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు స్థానికులు ఉండనున్నట్లు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.పిటిషనర్లు చెబుతున్నట్లుగా.. ఇళ్లు లేని లబ్ధిదారుల్ని గుర్తించి, తుది జాబితా తయారీలో ఇందిరమ్మ కమిటీల నిర్ణయమే అంతిమం కాదని వెల్లడించింది. ఈ కమిటీలు రూపొందించిన అర్హుల జాబితాపై.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. దీనివల్ల పిటిషనర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగదని భరోసా కల్పించారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. ప్రభుత్వ జీవోను రద్దు చేయడం వీలుకాదని వెల్లడించింది.కార్యనిర్వాహక వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలను తాము నిర్దేశించలేమని తెలిపిన న్యాయస్థానం.. ప్రభుత్వ ఉద్దేశంలో తప్పులు లేవని వెల్లడించింది. ఈ కమిటీల ద్వారా కేవలం అర్హుల ఎంపికలో సాయం మాత్రమే తీసుకొంటున్నారని అందులో తప్పులేదని తెలిపింది. రాష్ట్రంలో ఎక్కడైనా.. అనర్హులను ఈ జాబితాలో చేర్చి ప్రయోజనం చేకూర్చాలనుకుంటే.. కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది.

# గులాబీ జెండా లేకుండా కవిత...

హైదరాబాద్: బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తెలంగాణ బీసీ కమిషన్ ను కలిశారు. ఆమె పర్యటనలో ఎక్కడా బీఆర్ఎస్ నేతలు కనిపించలేదు. అలాగే బీఆర్ఎస్ కండువాలు కూడా. తెలంగాణ జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నారు. జాగృతిలో ఉన్న నేతలే ఆమె వెంట ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆమె చేస్తున్న పోరాటంపై బీఆర్ఎస్ సైలెంట్ గా ఉంది. ఇదొక్కటే కాదు.. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కూడా బీఆర్ఎస్ నేతలు లేకుండానే వెళ్లి పరామర్శించి వచ్చారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టు అయిన తర్వాత దాదాపుగా ఐదు నెలలకుపైగా జైల్లో ఉన్నారు. తర్వాత బెయిల్ పై విడుదలయ్యారు. ఆ తర్వాత పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకున్నారు. అయితే హఠాత్తుగా అదానీ ఇష్యూ బయటకు వచ్చిన వెంటనే స్పందించారు. అదానీతో పూర్తిగా కాంగ్రెస్ కు లింక్ పెట్టి బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. బీజేపీని మోదీని విమర్శించడం లేదు. కానీ కవిత మాత్రం తన సైలెన్స్ ను బ్రేక్ చేసి మొదటి ట్వీట్ మోదీనే నిలదీశారు. అదానీపై ఆధారాలున్నా పట్టించుకోవడం లేదని తన లాంటి వారిని జైల్లో పెడతారా అని ప్రశ్నించారు. ఈ ట్వీట్ సంచలనం అయింది. మరో వైపు ఒకప్పుడు తెలంగాణ జాగృతిగా విస్తృతమైన కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ తర్వాత భారత జాగృతిగా మారింది. ఎన్నికల్లో ఘోరపరాజయం ఎదురు కావడంతో జాగృతి కార్యకలాపాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. కానీ ఇప్పుడు తెలంగాణ జాగృతిగానే తన సంస్థను తెరపైకి తెచ్చి పాత నేతలందర్నీ పిలిచి మళ్లీ సమావేశం నిర్వహించారు. ఇక వరుసగా రాజకీయ పోరాటాలు చేయనున్నారు. అయితే అవి రాజకీయం అనే భావన రాకుండా వివిధ వర్గాల కోసం అన్నట్లుగా రాజకీయాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇందులో ఎక్కడా బీఆర్ఎస్ పాత్ర ఉండదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కవిత ఇలా సొంతంగా జాగృతి పేరుతో రాజకీయాలు చేయడంపై తెలంగాణ రాజకీయాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఇదంతా వ్యూహాత్మకమేనని కొ?న్ని వర్గాలు బావిస్తున్నాయి. ప్రస్తుతం కేటీఆర్ పార్టీని నడిపిస్తున్నారు. కేసీఆర్ పూర్తిగా ఫామ్ హౌస్‌కు పరిమితయమ్యారు.ఆయన వచ్చే ఏడాది మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అప్పటికి మళ్లీ కవిత బీఆర్ఎస్ నేతగా రాజకీయాలు చేస్తారని అంటున్నారు. అయితే కేటీఆర్ తో కవితకు విబేధాలు ఉన్నాయని.. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరాటం కారణంగానే కవిత తన సొంత రాజకీయాలు చేసుకుంటున్నారని అంటున్నారు.ఏది నిజమో భవిష్యత్ రాజకీయ పరిణామాలే స్పష్టం చేసే అవకాశం ఉంది.

# లేడీ అఘోరిపై మరో కేసు

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలలో సంచలనంగా మారిన అఘోరీ మాత మరో వివాదంలో చిక్కుకున్నారు. ఏపీ పర్యటన సమయంలో హల్చల్ చేసి పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన అఘోరీ మాత అంటే తెలియని వారుండరు. శ్రీకాళహస్తి వివాదం నుండి మంగళగిరి వరకు ఈమె పర్యటన వివాదాల చుట్టే సాగింది. మంగళగిరిలో అయితే ఏకంగా కర్ర తీసుకొని దాడికి కూడా పాల్పడ్డారు. అంతేకాదు డిప్యూటీ సీఎం పవన్ ను తాను కలవాల్సిందేనంటూ రహదారిపై బైఠాయించి, పోలీసులు తాళ్లతో కట్టి తీసుకెళ్లే స్థితికి అఘోరీ మాత వివాదాన్ని తీసుకెళ్లారు. ఇలా ఏపీలో హల్చల్ చేసి తెలంగాణలో ఎంటర్ అయిన అఘోరీ వరంగల్ శ్మశానవాటిక కు చేరుకున్నారు.అక్కడ చేసిన ఓ బలి ప్రస్తుతం కేసు నమోదు వరకు తీసుకెళ్ళింది. ఈనెల 19వ తేదీన వరంగల్ లోని బెస్త శ్మశానవాటిక లో పూజలు నిర్వహించారు. ఈ పూజలు ఎలా సాగాయంటే, స్థానిక ప్రజలు నిద్ర కూడా పట్టని రీతిలో సాగాయని వారు తెలుపుతున్నారు. ఏకంగా బ్రతికి ఉన్న కోడిని మంటల్లో వేసి పూజలు చేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపిల్లలు ఉండే ప్రాంతంలో ఈ పూజలు ఏమిటని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అంతేకాదు ఈ పూజలు అఘోరీ ఎవరి కోసం, ఎందుకోసం చేశారో అర్థం కావట్లేదని స్థానికులు ధైర్యంగా లేడీ అఘోరీ కారుకు అడ్డుపడి నిలదీశారు.ఇప్పుడు పూర్తిగా గడ్డం, మీసాలు పెంచిన ఆఘోరీ మాత్రం తాను ఏ పూజలు చేయలేదని, ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాజాగా అఘోరీ కోడిని బలి ఇవ్వడంపై మాత్రం రోహన్ రెడ్డి అనే విద్యార్థి మామునూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అలాగే అఘోరీ మాత ఆచూకీ కోసం పోలీసులు గాలింపు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వరంగల్లోని స్మశాన వాటికను ఆవాసంగా ఏర్పాటు చేసుకున్న అఘోరీ మాతపై పోలీసులు కేసు నమోదు చేయడంతో మరోమారు వార్తల్లో నిలిచారు.పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు. కేసు నిరూపణ అయితే ఒక్క రోజు నుంచి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంటుందని అన్నారు. ఏ మతం వారైనా దేవుళ్ల పేరుతో జంతుబలి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఘోరీ ఎక్కడ ఉందో పోలీసులు గుర్తించలేదు. కొద్ది రోజులుగా ఏపీలో ఆలయాల వద్ద నాగసాధు అఘోరీ హల్చల్ చేసింది. కారులో ప్రయాణిస్తూ వివిధ ఆలయాలకు వెళ్లగా.. నగ్నంగా ఉండడంతో దర్శనానికి అనుమతించ లేదు. అనంతరం ఆమె దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించారు. ఇటీవలే మంగళగిరిలో నడిరోడ్డుపై హల్చల్ చేయగా పోలీసులు అఘోరీని అతి కష్టం మీద నిలువరించారు. మంగళగిరి హైవేపై బైఠాయించగా.. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆమె వారిపై దాడికి పాల్పడింది. అనంతరం తెలంగాణకు చేరుకుంది. ఈ క్రమంలోనే సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూ ధర్మం రక్షణ కోసం పోరాడుతుంటే.. తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అఘోరీ మండిపడ్డారు. హిందూ దేవాలయాలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు. తెలంగాణలో తనను ఆపే మగాడు ఇంకా పుట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణలో ఆలయాలు ధ్వంసం అవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని తెలిపింది. స్త్రీలపై దాడులను ఆపే శక్తి మన దగ్గర ఉందని చెప్పుకొచ్చింది. గోహత్యలను నివారించేందుకు పోరాడదామని చెప్పుకొచ్చింది.

# నెలకు 5 వేలపైనే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్: నిత్యం రద్దీతో కితకితలాడే హైదరాబాద్ రహదారులపై మద్యం బాబులు దర్జాగా తిరిగేస్తున్నారు. రోడ్లపై ఏ కాస్త ఏమరపాటుగా ఉన్నా ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లోనూ మందు తాగేసి ఎంచక్కా బండ్లు నడిపేస్తున్నారు. పోలీసులు వారిస్తున్న, ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ.. మందుబాబులను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ దారిని మాత్రం మార్చుకోవటం లేదు. గత మూడు నెలలుగా నగరంలో నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ. హైదరాబాద్ లో ఆగస్టు 24 నుంచి నవంబర్ 21 వరకు మూడు నెలల్లో నగరంలో పట్టుబడిన వారి సంఖ్య ఏకంగా 14 వేల మంది కావడం గమనార్హం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో విస్తృతంగా మద్యం తనిఖీలు చేపడుతున్న పోలీసులు 13,188 మందిపై కేసులు నమోదు చేసి.. కోర్టులకు పంపించారు. వీరిపై ఛార్జిషీట్లు సైతం దాఖలు చేశారు. ఈ విషయాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ వెల్లడించారు.మద్యం కేసుల్లో గత మూడు నెలల్లోనే మొత్తం 824 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులకు హాజరుపరచగా.. ఒకటి నుంచి పది రోజుల పాటు సామాజిక సేవ చేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరో 25 మందికి రెండు రోజులు పాటు సామాజిక సేవ చేయాల్సిందిగా ఆదేశించింది.అతిగా మద్యం సేవించిన కేసుల్లో 89 మంది లైసెన్సుల్ని రెండు నుంచి ఆరు నెలలు సస్పెండ్ చేయాల్సిందిగా ఆర్టీవోకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయి.ఇందుకు గాను వివిధ స్థాయి కేసులులో ఉల్లంఘనలకు న్యాయస్థానం రూ.2 కోట్ల 87 లక్షల 20 వేల 600 జరిమానాగా విధించింది. మద్యం మత్తులో జరుగుతున్న వాహన ప్రమాదాలు పెరుగుతున్న తరుణంలో పోలీసులు నగరవ్యాప్తంగా అనేకచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నారు. ఇలా నవంబర్ 9న చేపట్టిన తనిఖీల్లో ఒకేరోజు ఏకంగా 327 మంది పరిమితం మించి మద్యం సేవించి.. తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరందరికీ కేసులు నమోదు చేసిన పోలీసులు.. కోర్టులకు పంపించారు.పరిమితికి మించి మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 % ? 70 % వరకు ద్విచక్ర వాహనాల ప్రమాదాలే కావడం గమనార్హం. పోలీసులు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. మొత్తం నమోదైన 14,000 కేసుల్లో 11,900 మంది ద్విచక్ర వాహనదారులే ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడిస్తున్నారు. మందు తాగి పోలీసులకు చిక్కిన వారిలో 630 మంది రక్తంలో ఆల్కహాల్ పర్సంటేజ్ ఏకంగా 200 దాటినట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. ఇలా మోతాదుకు మించి మందు తాగేవారిని అరికట్టేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల సంఖ్యను పెంచుతున్నారు. ఈ తనిఖీల్లో పట్టుబడుతున్న వారికి గోషామహల్, బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రాల్లో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. వీరంతా మరోసారి ఇలాంటి పొరపాట్లకు పాల్పడకుండా.. కుటుంబ సభ్యుల సమక్షంలో నగర ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అతిగా మద్యం సేవించి రోడ్లపైకి వస్తే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు.

# డేంజర్ జోన్ లో హైదరాబాద్

హైదరాబాద్: దేశ రాజధాని ఢిల్లీ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది వాయుకాలుష్యం. అవును.. ఇప్పుడు ఢిల్లీలో ఏ మూల చూసిన వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇది రోజురోజుకీ పరుగుతుంది. అక్కడి కాలుష్య చేయి దాటిపోయింది మరీ.. ప్రస్తుతం ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో సగటు గాలి నాణ్యతా సూచీ 500 మార్కులు దాటేసింది. దీంతో అక్కడి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అయితే దక్షిణాదిన ఢిల్లీ మాదిరే మరో కాలుష్య నగరం తయారవుతోంది. అది హైదరాబాదే. ఈ మహానగరానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన వారు ఉపాధి పొందుతుంటారు. విదేశీయులు సైతం ఇక్కడకు వచ్చి ఆవాసం ఏర్పాటు చేసికుని ఉంటున్నారు. ఇలాంటి హైదరాబాద్ నగరాన్ని కాలుష్య భూతం కబలిస్తుంది. గత వారం రోజులుగా ఈ మహానగరంలో వాతావరణంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఆదివారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దారుణంగా పడి పోయింది. చాలా ప్రాంతాల్లో 300 మార్కు దాటేసింది.ముఖ్యంగా కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్, నాంపల్లి, మెహదీపట్నం తదితర ప్రాంతాల్లో గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇన్‌డెక్స్ 300 దాటి పోయింది. ఢిల్లీకి సరి సమానంగా గాలి కాలుష్యం నమోదవడం అత్యంత ఆందోళన కరంగా మారింది. పరిస్థితి చేజారక ముందే చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్తలు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే అతి త్వరలోనే జంట నగరాల వాసులు శ్వాస కోశ వ్యాధుల భారీన పడే ప్రమాదం ఉంది. ఒక్కసారిగా కాలుష్యం పెరగానికి వాహనాలు ఒక కారణమైతే.. ఎక్కడో ఊరి బయట ఉండే ఫ్యాక్టరీలు ఇప్పుడు నగరం మధ్యలో తిష్టవేశాయి. దీంతో వాయి కాలుష్యం భారీగా పెరిగిపోతుంది. వాయు కాలుష్యం మాత్రమే కాదు హైదరాబాద్‌లో రకాల కాలుష్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఇక రోడ్లపై ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా తారుమారైంది. రహదారులపై విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది చలానాలు రాయడంలోనే మునిగిపోతున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాయు, శబ్ద కాలుష్యం మరింత పెరుగుతుంది.గతంలో రోడ్లకి ఇరువైపులా ఎంతో కొంతమేర భారీ వృక్షాలు ఉండేవి. రోడ్ల విస్తీర్ణం పేరుతో వాటినీ తొలగించారు. దీంతో ఎందరికో ఆశ్రయం ఇచ్చి ఉపాధి కల్పిస్తున్న హైదరాబాద్ మహానగరం కాలుష్య కోరల్లో చిక్కుకుని దాని వైభవాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ రోజు కూడా నగరంలో కాలుష్యం 300 మార్క్ వద్దే కొనసాగుతుంది. ఇదిలాగే కొనాసాగితే హైదరాబాద్ కూడా మరో ఢిల్లీ అవుతుందని నగర వాసులు భయకంపితులవుతున్నారు.

# యువత చెడు వ్యసనాలనుంచి దూరంగా వుండాలి

హైదరాబాద్: యువత గంజాయి, డ్రగ్సాంటి మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసకావద్దని మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి అన్నారు. నాచారం లో జాన్సన్ గ్రామర్ స్కూల్ లో విద్యార్థిని విద్యార్థులకు నాచారం పోలీసులు, సైబర్ క్రైమ్, నార్కోటిక్ సంయుక్తంగా సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు భానిసకాకుండా ఏకాగ్రతతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అపరిచిత వ్యక్తులు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. షీ టీమ్స్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు, ఫోక్సో చట్టాలు, సోషల్ మీడియా, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యతపై వివరించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడిరచిన వెంటనే డయల్ 100 కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు వారి బాగోగులతో పాటు సరైన మార్గంలో వెళు న్నారో లేదో చూడాలని సూచించారు.

# హరిత హారం పెద్ద స్కామ్....

హైదరాబాద్: కాళేశ్వరం కన్నా అతిపెద్ద కుంభకోణం హరితహారంలో జరిగిందని బీఆర్ఎస్ మాజీ కార్యకర్త గుండమల్ల రాజేంద్ర కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2015లో ఈ పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇది పదివేలు, లక్ష కోట్ల స్కామ్ కాదని అంతకంటే పెద్ద స్కామ్ అని ఆరోపించారు. 234 కోట్ల మొక్కలు నాటడం అనేది అసాధ్యం అని, రోబోలు కూడా ఆ పనిచేయలేవని చెప్పారు. ఒక్కో మొక్క కోసం దాదాపు రూ.50 రూపాయలు ఖర్చు అవుతుందని, దాని పెంపకం కోసం మెయింటెనెన్స్ రూ.3 వేలు ఖర్చు అవుతుందని అన్నారు. ఇది ఒక స్కామ్ అని కూడా ఎవరూ ఊహించరని చెప్పారు.కేసీఆర్, కేటీఆర్ లు చాలా స్మార్ట్ స్కామర్లు అని ఆరోపించారు. హరితహారం స్కామ్ ను ఎవరూ బయటపెట్టలేరని చెప్పారు. 234 కోట్ల మొక్కలు చూపించమంటే వరదలు వచ్చాయి? మొక్కలను పట్టించుకోలేదు అనే కారణాలు చూపించుకోవచ్చని అన్నారు. కానీ ఇప్పటికే ఆ పథకానికి సంబంధించిన డబ్బులు వారి ఖాతాల్లోకి వెళ్లిపోయాయని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పథకంలోనూ స్కామ్ చేశారని అన్నారు. పార్టీకి చెందిన జగన్ రావు సోదరుడు బెంగుళూరులో యాక్సిడెంట్ కు గురై అక్కడే ఆస్పత్రిలో చనిపోయాడని అన్నారు.అక్కడ చనిపోతే ఇక్కడే చనిపోయినట్టు సృష్టించి రూ.15 లక్షలు తీసుకున్నారని చెప్పారు. దీనిపై ఆర్టీఐ పెడితే ఇప్పటి వరకు తనకు సమాధానం రాలేదన్నారు. సీఎంఆర్ఎఫ్, హరితహారం,ఉద్యోగాలలోనూ స్కామ్ జరిగిందని అన్నారు.మిషన్ భగీరథలోనూ భారీ స్కామ్ జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అన్నీ స్కాములే జరిగాయని షాకింగ్ కామెంట్లు చేశారు. స్కామ్ ల గురించి మాట్లాడినందుకే తనను టార్చర్ చేశారని చెప్పారు.ఆ సమయంలో తనకు ప్రతిపక్ష నేతలు అండగా నిలిచారని అన్నారు. పార్టీలో ఉన్నప్పటికీ ప్రతిపక్ష నాయకులే కాపాడారని చెప్పారు. ఇంట్లో వెనక గదిలో పడుకుని ముందు రెండు డోర్లకు తాళం వేసుకుని పడుకునేవాళ్లమని, అంతలా భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. రాత్రుళ్లు భయంతో నిద్రపట్టేది కాదని,తనను చంపే ప్రయత్నాలు కూడా జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల పాటూ పార్టీ కోసం పనిచేశానని చివరికి ప్రభుత్వం తీరు చూసి విసిగి పోయానని అన్నారు.

# ప్రీ ల్యాంచ్ పేరుతో 150 కోట్ల మోసం

హైదరాబాద్: ప్రీలాంచ్ అంటూ ఆర్‌జే గ్రూప్ నడిపిన వ్యవహారం ఈ మధ్య వెలుగుచూసింది. 600 మందిని నిండా ముంచేసి ముఖం చాటేశారు సంస్థ చైర్మన్ భాస్కర్, ఎండీ సుధారాణి. ఇచ్చిన చెక్కులు బౌన్స్ కావడంతో పోలీసులను ఆశ్రయించారు బాధితులు. దీంతో వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నగర శివారులోని పలు ఏరియాల్లో అపార్ట్మెంట్స్, ఫామ్ ల్యాండ్స్ అంటూ ఆర్‌జే వెంచర్స్ ప్రకటనలు ఇచ్చింది. సినీ, క్రీడా ప్రముఖుల చేత యాడ్స్ చేయించి సామాన్యులకు వల వేసింది. 2020 ? 21 మధ్య వివిధ ప్రాజెక్టుల పేరుతో దాదాపు 600 మంది చేత 150 కోట్ల రూపాయల దాకా వసూలు చేసింది. మూడేళ్లలో ఫ్లాట్స్ ఇస్తామని చెప్పింది. కానీ, అలా జరగలేదు.2020 నవంబర్‌లో ఆర్ హోమ్స్ చదరపు గజం రూ.2,199కి ప్రీ లాంచ్ ఆఫర్‌తో ప్రకటించింది. కొనుగోలుదారులను ఆకర్షించడానికి మాజీ క్రికెటర్లు కపిల్ దేవ్, ఎంఎస్‌కే ప్రసాద్, మ్యూజిక్ డైరెక్టర్ కోటి వంటి ప్రముఖులతో ప్రకటనలు చేసి ప్రమోట్ చేసింది. చాలా మంది తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలనే ఆశతో ఫ్లాట్లను రిజర్వ్ చేసుకున్నారు. ఆర్ హోమ్స్ ఛైర్మన్ భాస్కర్ గుప్తా, అతని భార్య సుధా రాణి కొనుగోలుదారులకు రెండు మూడు నెలల్లో అవసరమైన అన్ని అనుమతులను పొందుతారని, ప్రాజెక్ట్ 2023 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. డబ్బులు వసూలు చేశారు. కానీ, అనుకున్న సమయానికి ప్రాజెక్ట్ పూర్తి కాలేదు.ధరణి, హెచ్ఎండీఏ, ఎన్నికలు ఇలా సాకులు చెబుతూ వచ్చారు. అయితే, సిద్దిపేట, కర్ధనూర్ సహా పలు ప్రాంతాల్లో ఇదే విధంగా ఫామ్ ల్యాండ్ పేరుతో డబ్బులు వసులు చేసింది ఆర్‌జే గ్రూప్. దీనిపై నిలదీసేందుకు కూకట్‌పల్లి కార్యాలయానికి వెళ్లారు బాధితులు. చైర్మన్ ముఖం చాటేశాడు. దీంతో ఆర్‌జే గ్రూప్‌పై సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు బాధితులు. ఈ క్రమంలోనే భాస్కర్, సుధారాణిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

# పర్యాటక రంగానికి ఊపు కోసం కసరత్తు

హైదరాబాద్: తెలంగాణలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిల్లో కొన్ని మినహా.. ఇతర ప్రాంతాలు అభివృద్ధి చెందలేదు. అయితే.. హైదరాబాద్ వెలుపల ఉన్న పర్యాటక ప్రదేశాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది.10 ప్రదేశాలను గుర్తించి అభివృద్ధి చేయనుంది. సరికొత్త అనుభూతిని పంచేందుకు ఏర్పాట్లు చేస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయి. చరిత్రకు అద్దంపట్టే ప్రదేశాలకు లెక్కలేదు. ఆహ్లాదం, ఆనందాన్ని పంచే ప్రాంతాలకు కొదవ లేదు. కానీ. ఆ ప్రాంతాలపై దృష్టిపెట్టక అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆయా ప్రాంతాలకు పర్యాటకులు వచ్చినా.. సరైన సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రధానంగా 10 సర్క్యూట్లపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. హైదరాబాద్ వెలుపల ఉండే పది ప్రత్యేక ప్రాంతాల్లో ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహించనుంది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా పర్యాటక పాలసీని తయారుచేస్తున్నారు. ఇది తుది మెరుగులు దిద్దుకుంటుంది. ఈ ముసాయిదాపై త్వరలోనే సమావేశం నిర్వహించి మార్పుచేర్పులు చేయనున్నారు. ఆ తర్వాత కేబినెట్‌లో చర్చించి పర్యాటక విధానాన్ని ఖరారు చేయనుంది. గుర్తించిన ప్రదేశాల్లో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూముల్లోనూ ప్రాజెక్టులు చేపట్టేలా పాలసీ ఉంటుందని తెలుస్తోంది. పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. పెట్టుబడిని బట్టి రూ. 100 కోట్ల వరకు, రూ. 100-500 కోట్లు.. ఆ పైన ప్రాజెక్టులుగా వర్గీకరిస్తున్నట్లుగా టూరిజం అధికారులు చెబుతున్నారు.రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాలు చాలా ఉన్నాయి. దీంతో ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు రాయితీలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ముఖ్యంగా క్యారవాన్ వాహనాలు, సాహస క్రీడలపై పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారంభాగ్యనగరానికి ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో.. హైదరాబాద్ వెలుపల, మారుమూల ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. పర్యాటక ప్రాజెక్టులపై పెట్టే ఖర్చు, ప్రాంతాన్ని బట్టి గరిష్ఠంగా రూ.25 లక్షల వరకు రాయితీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలా ప్రైవేట్ పెట్టుబడులు పెరిగితే.. తెలంగాణ టూరిజం కొత్తపుంతలు తొక్కే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ నగరానికి కేవలం 180 కి.మీ దూరంలోని నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి ఏపీలోని శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఏడాది పొడవునా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ కసరత్తు చేస్తోంది. మరో వైపు కేరళలోని అలప్పుజ, జమ్మూకశ్మీర్ శ్రీనగర్‌లోని దాల్ లేక్‌లో మాదిరి స్పీడ్ బోట్లు, హౌస్‌బోట్ల సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సైతం ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం కృష్ణానదిలో సమృద్ధిగా నీరు ఉండటంతో సోమశిల నుంచి శ్రీశైలం వరకు.. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు క్రూయిజ్ షిప్ టూర్‌ని రెండ్రోజుల క్రితం ప్రారంభించారు. సోమశిల- శ్రీశైలం 120 కి.మీ. దూరం కాగా 6.30 గంటల్లో నది అందాలను చూస్తూ జర్నీ చేయవచ్చు.ఈ లాంచీ ప్రయాణంలో అబ్బురపరిచే దృశ్యాలెన్నో పర్యాటకులను కనువిందు చేస్తాయి. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీప్రాంత అందాలను వీక్షించొచ్చు. నదికి ఓ వైపు తెలంగాణలో అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం ఉండగా.. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోని నాగార్జునసాగర్ టైగర్ రిజర్వు ఉంది. ఈ అడవుల్లో ఉండే పెద్దపులులు ఈదుతూ కృష్ణా నదిని దాటతాయి. నీటి మట్టం అధికంగా ఉన్నప్పుడు తప్పితే మిగతా సమయాల్లో పెద్దపులులు నది మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.త్వరలో హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గంలో సోమశిల, నాగార్జునసాగర్ టూర్లను అధికారులు ఫ్లా?న్ చేస్తున్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీశైలం నుంచి తీసుకురావడంతో పాటు అక్కడ బోర్డింగ్ వంటి సౌకర్యాల్ని కల్పించనున్నారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు నలుగురు ప్రయాణించేలా స్పీడ్ బోట్ల కొనుగోలుకు టూరిజం డిపార్ట్‌మెంట్ రెడీ అవుతోంది. 20 సీట్లతో డీలక్స్ బోట్‌ను కొనుగోలు చేయనుంది. ఇవి అందుబాటులోకి వస్తే. బోటు ప్రయాణాన్ని పర్యాటకురాలు ఆస్వాదించొచ్చు.ఇక నవంబర్ 2న ప్రారంభమైన క్రూయిజ్ షిప్‌ల ప్రత్యేక ప్యాకేజీ విషయానికొస్తే.. సింగిల్ వే పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా నిర్ణయించారు.రౌండప్ టూర్ ప్యాకేజీ అయితే.. పెద్దలకు రూ. 3000, పిల్లలకు రూ. 2,400గా డిసైడ్ చేశారు. సోమశిల-శ్రీశైలం, నాగార్జున సాగర్- శ్రీశైలం ఈ రెండు టూర్లకు ఇదే ప్యాకేజీ వర్తించనుంది.

# చివరిదశకు కుటుంబసర్వే

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరింది. మరోవైపు శనివారం నుంచి వివరాల కంప్యూటరీకరణ కూడా షురూ అయింది. ఈ నెలఖారులోపు ఈ ప్రక్రియను కూడా పూర్తి చేసే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే తుది దశకు చేరింది. చాలా జిల్లాల్లో సర్వే ప్రక్రియ పూర్తి కాగా? మరికొన్నిచోట్ల 90 శాతం దాటింది. ఇప్పటి వరకు కోటికిపైగా నివాసాల్లో సర్వే పూర్తి అయింది. మరో పది శాతం ఇళ్లల్లో సర్వే పూర్తి అయితే వంద శాతం చేరుకుంటుంది.ఓవైపు సర్వేలో భాగంగా వివరాల సేకరణ ప్రక్రియ పూర్తి కావటంతో మరోవైపు డేటా ఎంట్రీపై అధికారులు దృష్టి పెట్టారు. పలు జిల్లాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. శనివారం నుంచి వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు. ఎంపీడీవోతో పాటు పలు కార్యాలయాల్లో ప్రత్యేకంగా డేటాను ఎంట్రీ చేస్తున్నారు. నవంబర్ 30వ తేదీలోపు డేటా ఎంట్రీ పని పూర్తి అయ్యే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారంలోపు ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది.మొత్తం 33 జిల్లాల్లో దాదాపు ఎనిమిది నుంచి 9 జిల్లాల్లో సర్వే పూర్తి కావొచ్చింది. ములుగు, జనగాం, వరంగల్ జిల్లాల్లో వంద శాతం వరకు చేరుకుంది. ఈ జిల్లాల్లో డేటా ఎంట్రీ పనులు ప్రారంభమయ్యాయి. మెదక్ జిల్లాల్లో 99.9 శాతం, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99 శాతం సర్వే పూర్తి కావొచ్చింది.సర్వే ప్రక్రియ, డేటా ఎంట్రీపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు.మొత్తం 33 జిల్లాల్లో దాదాపు ఎనిమిది జిల్లాల్లో సర్వే పూర్తయినట్టు సమాచారం. ములుగు, జనగాం జిల్లాల్లో వందకు వంద శాతం పూర్తి కాగా నల్గొండ, మెదక్ జిల్లాల్లో 99.9 శాతం, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99 శాతం సర్వే పూర్తయినట్టు తెలుస్తోందికామారెడ్డి జిల్లాలో 98.5 శాతం పూర్తికాగా.. మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే పూర్తి చేసినట్టు సమాచారం. జన సాంద్రత ఎక్కువగా ఉండటంతో.. గ్రేటర్ హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో సర్వే కాస్త నెమ్మదిగా సాగుతోందని అధికారులు చెప్తున్నారు. వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న వారు, తాళాలు వేసి ఉన్న ఇండ్లను మినహాయిస్తే.. మిగిలిన అన్ని కుటుంబాల సర్వే వంద శాతం పూర్తయిందని అధికారులు చెప్తున్నారు.మొదట్లో ఎన్నో అనుమానాలు, అపోహలు.. వ్యక్తమైనప్పటికీ కుల గణనతోనే సామాజిక సాధికారత, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల అభ్యున్నతికి సర్వే ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డితో పాటు ప్రభుత్వ పెద్దలకు ప్రజలకు వివరిస్తుండటంతో.. అన్ని వర్గాల నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు.. వివిధ దశల్లో దాదాపు లక్ష మందికి పైగా ఉద్యోగులు ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాలుపంచుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,16,14,349 కుటుంబాలు ఉన్నట్లుగా సర్కార్ గుర్తించింది. నవంబర్ 06 నుంచి 08వ తేదీ వరకు ఇండ్ల గణన చేపట్టగా.. నవంబర్ 9వ తేదీ నుంచి అసలు కుల గణన సర్వేను సర్కార్ ప్రారంభించింది. మొత్తం1,16,14,349 కుటుంబాల్లో గ్రామీణ ప్రాంతాల్లో 64,41,183 కుటుంబాలుండగా.. పట్టణ ప్రాంతాల్లో 51,73,166 కుటుంబాలు ఉన్నాయని సర్వేలో లెక్క తేలింది. ఈ సర్వే కోసం మొత్తం 87,807 మంది ఎన్యుమరేటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 47,561, పట్టణ ప్రాంతాల్లో 40,246 మంది విధుల్లో ఉన్నారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించటంతో పాటు ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక పర్యవేక్షకుడిని నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,788 మంది సూపరింటెండెంట్లు సర్వేలో పాల్గొంటున్నారు

# పడిపోతున్న ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్

హైదరాబాద్: ఒకవైపు చల్లటి గాలులతో పాటు వాయు కాలుష్యం కూడా నగరాల్లో విపరీతంగా పెరిగిపోతుంది. హైదరాబాద్ కూడా డేంజర్ బెల్స్ మోగిస్తుంది. ఢిల్లీతో సమానంగా హైదరాబాద్ లో కూడా వాయు కాలుష్యం పెరిగిపోతుంది. ఇలాగే కొనసాగితే హైదరాబాద్ కూడా ఢిల్లీకి అతి త్వరగా చేరువయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. హైదరాబాద్ లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోయాయి. దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాంక్రీట్ జంగిల్ గా మారిన నగరంలో అనేక కారణాలు వాయు కాలుష్యానికి కారణాలుగా అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే వ్యాధుల బారిన పడతారని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తట్టుకోలేకపోతున్న తెలంగాణ జనం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్... హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాయు కాలుష్యం పెరిగిపోయింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోయాయి. ప్రధానంగా కూకట్ పల్లి, మూసాపేట, బాలానగర్, నాంపల్లి, మొహిదీపట్నంలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం చేరుకుందని నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రయాణించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వీలయితే మాస్క్ లను ధరించడం ఉత్తమమని చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో పాటు ఒక్కసారిగా వాయు కాలుష్యం పెరిగిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న వారు బయటకు వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు ఈ ప్రాంతాల్లో హైదరాబాద్ నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మూడు వందలకు క్రాస్ అయిందని చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరింత కాలుష్యం పెరిగే అవకాశముందని హెచ్చరికలు జారీ అవుతున్నాయి. ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఢిల్లీతో సమానంగా వాయు కాలుష్యం నమోదవుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కాలుష్య నియంత్రణ మండలి హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యం పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రధానంగా వయో వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులున్నవారు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# 60 ఏండ్ల రావిచెట్టును తరలించిన ద.మ.రైల్వే



హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయం ప్రాంగణంలో 60 ఏండ్లు పైబడిన రావి చెట్టును సురక్షితంగా మరోచోటికి తరలించారు. 40 అడుగుల ఎత్తు, మూడు మీటర్ల చుట్టుకొలతతో ఉన్న ఈ రావిచెట్టు వేర్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రకృతి నిపుణులు ఏ చంద్రమౌళి నేతృత్వంలో ఈ చెట్టును అక్కడి నుంచి తొలగించారు. చెట్టు స్థలమార్పిడిలో భాగంగా కొమ్మలను నరికివేసే ముందు, తర్వాత నూనెతో కూడిన 50 కిలోల వేప పిండి కేక్‌ను ఉపయోగించారు. అలాగే 200 లీటర్ల నీటిలో కరిగించిన 2 లీటర్ల హ్యూమిక్ యాసిడ్‌ను చల్లి, 180 కిలోల సహజ ఎరువును చెట్టును తిరిగి నాటిన స్థలంలో ఉపయోగించారు. కొత్త చెట్టు రెమ్మలు 3 నుంచి 6 నెలల్లో పెరుగుతాయని తెలిపారు.

# పాదయాత్రల ట్రెండింగ్ పోయి,...

## అరెస్ట్ ల ట్రెండింగ్...

హైదరాబాద్: ఒకప్పుడు పాద యాత్ర చేసిన నేతలు సీఎం అవుతారు అన్న సెంటిమెంట్ ఉండేది. రెండు దశాబ్దాలుగా.. అరెస్టు అయితే సీఎం అవుతారు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది నిరూపితమవుతోంది.రాజకీయాల్లో ఉన్న ఏ పార్టీ అయినా అధికారంలోకి రావాలనుకుంటుంది. ఇందు కోసం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుంది. ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు హామీలు ఇవ్వడం ద్వారా, మేనిఫెస్టో ప్రకటించడం ద్వారా ప్రజలు పార్టీలను గెలిపిస్తారు. అయితే 2004 నుంచి ట్రెండ్ మారింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర చేశారు. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యారు. దీంతో పాదయాత్ర సెంటిమెంట్‌గా మారింది. 2009లోనూ మరోమారు కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. ఇక 2013 జగన్ కూడా పాదయాత్ర చేశారు. కానీ విభజిత ఏపీకి సీఎం కాలేదు. అయితే తర్వాత జగన్ అరెస్ట్ అయ్యారు. దీంతో 2019లో ఏపీలో భారీ మెజారిటీతో వైసీపీని గెలిపించారు. జగన్ సీఎం అయ్యారు. అప్పటి నుంచి అరెస్ట్ అయిన నేతలు సీఎం అవుతారు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 20015లో తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం నాడు టీడీపీ నేతగా ఉన్న రేవంత్‌రెడ్డిని అరెస్టుచేయించింది. తర్వాత రాజకీయ పరిణామాలతో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయన 2023లో సీఎం అయ్యారు. ఇక 2023లో ఏపీ సీఎం జగన్ చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారు. స్కిరల్ కేసులో 50 రోజులు జైల్లో పెట్టారు. దీంతో 2024లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యారు.

### సోరెన్‌కు కలిసి వచ్చిన అరెస్ట్..

తాజాగా జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ జేఎంఎం ఆధ్వర్యంలోని కూటమి విజయం సాధించింది. ఇందుకు మనీ ల్యాండరింగ్ కేసులో ఆయనను ఈడీ అరెస్టు చేయడమే కారణమని భావిస్తున్నారు. 2024, జనవరి 31న ఈడీ హేమంత్ సొరేన్‌ను అరెస్టు చేసింది. జూన్‌లో ఆయనకు బెయిల్ వచ్చింది. ఆరు నెలలపాటు ఆయన జైల్లో ఉన్నారు. ఈ సమయంలో చంపైన్ సోరేన్ తాత్కాలిక సీఎంగా ఉన్నారు. హేమంత్ సోరెన్ బెయిల్‌పై బయటకు వచ్చాక మళ్లీ సీఎం బాధ్యతలు చేపట్టారు. ఆయన సారథ్యంలోనే జేఎంఎం ఎన్నికలకు వెళ్లింది. 2019 ఎన్నికల్లో సొంతంగా అధికారంలోకి వచ్చిన జేఎంఎం.. ఈసారి కూటమిగా అధికారంలోకి వచ్చింది. దీంతో అరెస్టు కావడం ద్వారానే జేఎంఎం విజయానికి కారణం అన్న విశ్లేషణ జరుగుతోంది.

### ఢిల్లీలో ఆప్ అధికారంలోకి వచ్చేనా..?

అరెస్టు అయిన నేతలు మళ్లీ సీఎం అవుతున్న సెంటిమెంట్ నేపథ్యంలో 2025, ఫిబ్రవరిలో జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందా అన్న చర్చ కూడా జరుగుతోంది. కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్టు చేసింది. సుమారు రెండు నెలలు జైల్లో ఉన్నారు. జైల్లో ఉన్న సమయంలో సీఎంగా కొనసాగిన కేజ్రీవాల్.. బయటకు వచ్చాక రాజీనామా చేశారు. అతిషికి సీఎం పగ్గాలు అప్పగించారు. ఇప్పుడు వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతన్నారు. 11 మందితో తొలి జాబితాను ప్రకటించారు. ఇప్పటికే ఆప్‌ను మూడుసార్లు గెలిపించిన ఢిల్లీ ప్రజలు ఈసారి ఎవరికి పట్టం కడతారో చూడాలి. అరెస్టు సెంటిమెంట్ అరవింద్ కేజ్రీవాల్‌కు కలిసి వస్తుందో లేదో ఫిబ్రవరిలో తేలిపోతుంది.

# ప్రతిపక్షాలు లేని రాష్ట్రాలు...

## ఆ జాబితాలో చేరిన మహారాష్ట్ర

ముంబై: దేశంలోనే మహారాష్ట్ర ఒక్క రాష్ట్రమే కాదు.. ప్రతిపక్ష నాయకుడు లేని రాష్ట్రాల జాబితాలో ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, నాగాల్యాండ్, సిక్కిం లాంటి రాష్ట్రాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో అధికార పార్టీలు భారీ మెజారిటీతో విజయాన్ని నమోదు చేశాయి.మహారాష్ట్ర రాజీకాయాలు గత అయిదు సంవత్సరాలుగా థ్రిల్లర్ సినిమాకు తలపించే విధంగా ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికలు ముగిసినా కొన్ని తేలని ప్రశ్నలు అలాగే మిగిలిపోయాయి. ఎన్నికల్లో ఆరు ప్రధాన పార్టీలు రెండు కూటములుగా తలపడ్డాయి. అయితే ఎన్నికల ఫలితాలు మాత్రం వార్ వన్ సైడే అన్నట్లు వెలువడ్డాయి. అధికార మహాయుతి పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఈ కూటమిలో బీజేపీ, అజిత్ పవార్ ఎన్సీపీ, షిండ్ శివసేన ఉండగా.. ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమిలో శరద్ పవార్ ఎన్సీపీ, ఉద్ధవ్ శివసేన, కాంగ్రెస్ ఉన్నాయి. అయితే ఎన్నికలు ముగిసిన ప్రతిపక్ష కూటమిలో ఏ పార్టీకి కూడా కనీసం 10 శాతం సీట్లు కూడా రాలేదు. దీంతో మూడు పార్టీలు కలిసి ప్రతిపక్ష నాయకుడిని ఎన్నుకుంటాయా? లేక ఆ పదవి కోసం కూడా పార్టీల మధ్య కుమ్ములాటలు ఉంటాయా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది.మొత్తం 288 అసెంబ్లీ సీట్లలో అధికార కూటమికి 235 సీట్లు లభించాయి. ఇందులో బీజేపీ అత్యధికంగా 132 సీట్లు సాధించింది. దీంతో ముఖ్యమంత్రి పదవి బీజేపీ అభ్యర్థికే దక్కే అవకాశాలున్నాయి. మరోవైపు కొత్తగా కొలువుదీరిన అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి 16 మంది ఎమ్మెల్యేలు ఉండగా, శరద్ పవార్ ఎన్సీపీకి 10 సీట్లు మాత్రమే ఉన్నాయి. ప్రతిపక్ష కూటమిలో అత్యధికంగా ఉద్ధవ్ బాల్ ఠాక్రే శివసేన పార్టీకి 20 సీట్లు లభించాయి. కానీ నిబంధనల ప్రకారం.. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా పొందడానికి ఒక పార్టీకి కనీసం 10 శాతం సీట్లు ఉండాలి. అయితే మొత్తం 288 అసెంబ్లీ సీట్లలో 29 సీట్లు ఒకే పార్టీ సాధించి ఉండాలి.ప్రతిపక్ష కూటమిలో ఏ పార్టీకి కూడా ఆ సంఖ్య దక్కలేదు. దీంతో 15వ మహారాష్ట్ర అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు లేకుండానే కొనసాగుతుంది. దేశంలో 16వ లోక్ సభ కూడా ప్రతిపక్ష నాయకుడు లేకుండా సాగింది. అయితే ప్రతిపక్ష కూటమిలోని అన్ని పార్టీల ఎమ్మెల్యేల సంఖ్య కలిపితే పది శాతం కంటే ఎక్కువగా ఉన్నా.. నిబంధనల ప్రకారం ఒకే పార్టీకి 10 శాతం సీట్లు తప్పకుండా లేకుంటే ప్రతిపక్ష హోదా దక్కదు. అందుకుగాను ఒకే పార్టీలోకి మిగతా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు మారాల్సి ఉంటుంది. ఇప్పటి రాజకీయాలలో అది కుదిరే పనికాదు. 18వ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ, ఎన్సీపీ, శివసేన కూటమి మహారాష్ట్రలో ఓడిపోయినా.. కేవలం అయిదు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించింది. బీజేపీకి అత్యధికంగా 132 సీట్లు, షిండే శివసేనకు 57 సీట్లు, అజిత్ పవార్ ఎన్సీపీకి 41 సీట్లు వచ్చాయని ఎన్నికల కమిషన్ తెలిపింది.ఈ ఎన్నికలు మహారాష్ట్ర రాజకీయాలో కురువృద్ధుడు అయిన శరద్ పవార్ ఘోర పరాజయం చవిచూశారు. ఇనేళ్ల ఆయన రాజకీయ ప్రస్థానంలో ఆయన పార్టీ కేవలం 10 సీట్లు మాత్రమే సాధించడం అవమానకరంగా మారింది. అలాగే మహారాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీక బాలాసాహెబ్ ఠాక్రేకు వారుసుడైన ఉద్ధవ్ ఠాక్రే కు కూడా కేవలం 20 దక్కాయి. వీరిద్దరి పార్టీలు రెండుగా చీలి పోవడం వల్లనే వీరి రాజకీయ దుస్థితికి కారణమని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

# పాతబస్తీ అభివృద్ధి సీపీఐ(ఎం) లక్ష్యం

**- రూ.10వేల కోట్లు కేటాయించాలి, ఉపాధి కల్పించాలి**

**- టూరిజం అభివృద్ధి చేయాలి : సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్**

**- పార్టీ సౌత్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**




ధూల్ పేట్: హైదరాబాద్ నగరంలో పాతబస్తీ చారిత్రాత్మకమని, దాని అభివృద్దే సీపీఐ(ఎం) లక్ష్యమని సీపీఐ(ఎం) సౌత్ జిల్లా కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. పార్టీ సౌత్ జిల్లా 4వ మహాసభ ముగింపు అనంతరం 16 మందితో ఏర్పాటైన నూతన కమిటీ సమావేశమై భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించాలన్నారు. చార్మినార్, గోల్కొండ, చార్ కమాన్, చౌమహాలహ్ ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్, సాలార్జంగ్ మ్యూజియం వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్గత దారులు సరిగా లేకపోవటంతో పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రుల సదుపాయాలు పెంచి, సౌకర్యాలు కల్పించాలన్నారు. చిన్న, చిన్న గృహ పరిశ్రమల్లో పని చేస్తున్న వారికి పెద్దగా ఆదాయం లేదని, వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. చిరు వ్యాపారులు వ్యాపారం పెంచుకుని ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం తోడ్పాటునందించాలని కోరారు. నాలుగున్నర(4.5) లక్షల మంది అద్దె ఇండ్లలో ఉంటున్నారని, వారికి ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. మూసీ నిర్వాసితుల (రివర్ బెడ్)కు నష్టపరిహారం చెల్లించి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. మూసీ బాఫర్ జోన్‌లో ఉన్న వారికి ప్రభుత్వం పక్కనే నిర్మించే బిజినెస్ కాంప్లెక్స్‌లో అవకాశం కల్పించాలన్నారు. ఓల్డ్ సిటీలో మతసామరస్యం నెలకొల్పేలా ప్రజలకు అవగాహణ కల్పించాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**- సీఎం సహా పలువురికి మెజారిటీ సంఘాల జేఏసీ వినతిపత్రాలు**



హైదరాబాద్: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మెజారిటీ ఆర్టీసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.

ఈ మేరకు జేఏసీ చైర్మెన్ అశ్వత్థామరెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి, రవాణాశాఖ మంత్రి కార్యాలయాలు, టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. డిసెంబర్ మొదటివారంలోపు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, యూనియన్ల పునరుద్ధరణ సహా ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో డిసెంబర్ 9 తర్వాత ప్రత్యక్ష పోరాటంలోకి దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మర్రి నరేందర్, కో కన్వీనర్లు కులకర్ణి, పున్న హరికిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్ క్రికెటర్ సరికొత్త రికార్డ్...

## 28 బంతుల్లోనే సెంచరీ

**– రిషబ్ పంత్ పేరిట ఉన్న రికార్డ్‌ను తుడిపేసిన ఉర్విల్ పటేల్**

**– 7 ఫోర్లు, 12 సిక్స్‌లతో 113 పరుగులు చేసిన పటేల్**

**– ప్రపంచ క్రికెట్‌లో రెండో అత్యుత్తమం**



గుజరాత్ క్రికెటర్ ఉర్విల్ పటేల్ టీ20లో 28 బంతుల్లో సెంచరీ చేసి ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా రికార్డ్ సృష్టించాడు. గతంలో ఈ రికార్డ్ రిషబ్ పంత్ పేరిట ఉంది. మధ్యప్రదేశ్ వేదికగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో త్రిపుర జట్టుతో 26 ఏళ్ల ఉర్విల్ అసాధారణ ప్రతిభను కనబరిచి పంత్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. మ్యాచ్ ప్రారంభం నుంచి చివరి వరకు అతను దూకుడు ప్రదర్శించాడు. 7 ఫోర్లు, 12 సిక్స్‌లతో 113 పరుగులు చేశాడు. గత ఏడాది చండీగఢ్ వేదికగా అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో ఉర్విల్ పటేల్ 41 బంతుల్లో 100 పరుగులు చేశాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో ఉర్విల్ పటేల్ అన్–సోల్డ్ క్రికెటర్‌గా ఉన్నాడు.

ప్రపంచ క్రికెటర్లలో టీ20లో ఇది రెండో అత్యుత్తమం. ఈ ఏడాదిలోనే సైప్రస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈస్టోనియాకు చెందిన క్రికెటర్ సాహల్ చౌహాన్ 27 బంతుల్లో సెంచరీ చేశాడు. పొట్టి ఆటలో ఇప్పటి వరకు ఇదే రికార్డ్. 2018 జనవరిలో ఢిల్లీ తరఫున ఆడిన రిషబ్ పంత్ 32 బంతుల్లో మూడంకెల పరుగును చేరుకున్నాడు.

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్.. నెం.01 బౌలర్‌గా జస్ప్రీత్ బుమ్రా.. జైస్వాల్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్!

**– పెర్త్ టెస్టులో 8 వికెట్లతో రాణించిన జస్ప్రీత్ బుమ్రా**

**– ఈ ప్రదర్శన కారణంగానే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం**

**– కగిసో రబాడ, హేజిల్‌వుడ్‌ను దాటేసి టాప్ ర్యాంక్**

**– బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్‌కు రెండో ర్యాంక్**



ఐసీసీ బుధవారం విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో నిలిచాడు. పెర్త్ టెస్టులో 8 వికెట్లు తీసి భారత్‌కు 295 పరుగుల తేడాతో బంపర్ విక్టరీని అందించాడీ ఫాస్ట్ బౌలర్. ఈ అద్భుత ప్రదర్శన కారణంగానే బుమ్రా నెం.01 బౌలర్‌గా నిలిచాడు. కగిసో రబాడ, జోష్ హేజిల్‌వుడ్‌ను దాటేసి టాప్ ర్యాంక్‌కు దూసుకెళ్లాడు. అటు టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్ లో భారీ సెంచరీతో అలరించిన యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్ సాధించాడు. మనోడు ఏకంగా రెండో స్థానం కైవసం చేసుకున్నాడు. పెర్త్ టెస్టులో 161 పరుగులు చేయడంతో జైస్వాల్ ర్యాంక్ మెరుగయింది. ప్రస్తుతం జైస్వాల్ 825 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. నెం.01 బ్యాటర్ జో రూట్ 903 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇక పెర్త్ మ్యాచ్‌లోనే సెంచరీ బాదిన భారత సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు ర్యాంకింగ్స్‌లో 13వ స్థానానికి చేరుకున్నాడు. అటు టెస్టు ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ వరుసగా ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నారు. ఈ ఇద్దరూ పెర్త్ టెస్టులో బెంచ్‌కే పరిమితమైనా తమ ర్యాంకులను కోల్పోలేదు.

# టెస్టు ర్యాంకింగ్స్.. అగ్రస్థానానికి బుమ్రా, రెండో స్థానంలో జైస్వాల్..



ICC టెస్టు ర్యాంకింగ్స్ లో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా సత్తా చాటాడు. మరోసారి నంబర్ బౌలర్ గా నిలిచాడు. బుధవారం ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ ప్రకటించింది. ఈ జాబితాలో భారత ఆటగాళు తమ ర్యాంకులను భారీగా మెరుగుపర్చుకున్నారు. బ్యాటింగ్‌లో యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ రెండో స్థానానికి దూసుకెళ్లాడు. ఇక, పంత్ 6వ స్థానం, విరాట్ కోహ్లీ 13వ స్థానంలో నిలిచారు.

బౌలింగ్ విభాగంలో బుమ్రా మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. అశ్విన్ 4, జడేజా 7వ స్థానం పొందారు. ఆల్ రౌండర్లలో జడేజా తొలి స్థానం, అశ్విన్ రెండో స్థానంలో, అక్షర్ పటేల్ ఏడో స్థానంలో నిలిచారు. కాగా, బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇటీవల పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో జైస్వాల్, కోహ్లీ సెంచరీలు చేయగా, బుమ్రా 8 వికెట్లతో రాణించారు.

# రెండో టెస్టుకూ శుభ్‌మన్ గిల్ దూరం..?



బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్ పర్యటనలో ఉన్న టీమిండియా.. ఆతిథ్య జట్టుతో రెండో టెస్టు డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. అయితే, రెండో టెస్టుకు కూడా భారత బ్యాట్స్ మెన్ శుభ్‌మన్ గిల్ దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ సిరీస్ కు ప్రారంభానికి ముందు ప్రాక్టీస్ మ్యాచ్ లో గిల్ గాయపడ్డాడు. దీంతో అతను తొలి టెస్ట ఆడలేదు.ఇంకా గాయం నుంచి కోలుకోకపోవడంతో గిల్ రెండో టెస్టుకూ అందుబాటులోకి వచ్చే అవకాశం లేదని సమాచారం. గాయం పూర్తిగా నయం కావాలంటే.. మరో రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని గిల్ కు వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో అడిలైడ్ టెస్టుకు గిల్ దూరం కానున్నట్లు క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా, తొలి టెస్టులో భారత్ అదరగొట్టింది. ఆసీస్ ను చిత్తు చేసి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

# హైబ్రిడ్ పద్ధతిలో ఛాంపియన్స్ ట్రోఫీ!

### పిసిబికి ఐసిసి భారీ నజరానా?

దుబాయి: పాకిస్థాన్ వేదికగా వచ్చే ఏడాది ఐసి సి వన్డే ఛాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉన్న విష యం తెలిసిందే. అయితే పాక్ గడ్డపై తాము ఆ డే ప్రసక్తే లేదని భారత క్రికెట్ బోర్డు (బిసిసిఐ) ఇప్పటికే ఐసిసికి స్పష్టం చేసింది. ఇక పాకిస్థాన్ కూడా అన్ని మ్యాచ్‌లు కూడా పాక్‌లోనే జరగాలని పట్టుబడుతోంది. ఇలాంటి స్థితిలో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై అనుమానాలు నెలకొన్నాయి. తమ గడ్డపై భారత్ ఆడాల్సిందేనని పి సిసి కోరుతోంది. దీని కోసం బిసిసిఐని ఒప్పించాలని ఐసిసిని కోరింది. భారత్ మాత్రం పాక్ లో ఆడేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించడం లే దు. తమకు సంబంధించిన మ్యాచ్‌లను పాకిస్థా న్ బయట నిర్వహించాలని బిసిసిఐ డిమాండ్ చేస్తోంది. దీనికి పిసిబి ఏమాత్రం ఒప్పుకోవడం లేదు. టోర్నీ నిర్వహణ బాధ్యతలునైనా వదులుకుంటామని హైబ్రిడ్ విధానానికి ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో టోర్నీని సాఫీగా నిర్వహించేందుకు ఐసిసి రంగంలోకి దిగింది. దీని కోసం పిసిబి ఒప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైబ్రిడ్ విధానంలో ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తే భారీ నగదు పురస్కారాన్ని అందిస్తామని ఐసిసి హామీ ఇచ్చినట్టు తెలిసింది. ఒకవేళ పిసిబి ఈ ఆఫర్‌కు ఒప్పుకుంటే ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహిణపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడుతుంది.

# వేదిక మారుతుందా?!

**– ఓటింగ్‌తో తేల్చాలనే ఆలోచన**

**– 29న ఐసీసీ కీలక సమావేశం**




దుబాయ్: ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ వేదికపై ఉత్కంఠ కొనసాగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పాకిస్థాన్‌లో ఆడబోమని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తేల్చి చెప్పగా.. హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీ నిర్వహణకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఎంతమాత్రం సుముఖంగా లేదు. దీంతో ప్రతిష్టాత్మక ఈవెంట్ నిర్వహణ పట్టాలెక్కించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) సరికొత్త ఆలోచన చేసింది. ఈ నెల 29న ఐసీసీ బోర్డు సమావేశం జరుగనుంది. వర్చువల్‌గా జరుగనున్న ఈ సమావేశంలో చాంపియన్స్ ట్రోఫీ వేదికపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

ఓటింగ్‌కు అవకాశం?

ఐసీసీ బోర్డులో 12 మంది శాశ్వత సభ్య దేశాలు, అసోసియేట్ సభ్య దేశాల ప్రతినిధులు ముగ్గురు, స్వతంత్ర డైరెక్టర్, ఐసీసీ చైర్మన్ సహా సీఈవో ఉంటారు. ఐసీసీ చైర్మన్ హోదాలో గ్రెగ్ బార్లే అధ్యక్షత వహించనున్న చివరి సమావేశం ఇదే కానుంది. డిసెంబర్ 1న బీసీసీఐ కార్యదర్శి జై షా ఐసీసీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. చాంపియన్స్ ట్రోఫీ విషయంలో బీసీసీఐ హైబ్రిడ్ మోడల్ కోరుతుంది. భారత మ్యాచులను తటస్థ వేదికపై నిర్వహించాలని కోరుతోంది. అందుకు పాకిస్థాన్ ససేమిరా అంటోంది. భారత్ కూడా పాక్‌లోనే ఆడాలని పట్టుబడుతోంది. చాంపియన్స్ ట్రోఫీ పూర్తిగా పాక్‌లో జరగాలా? హైబ్రిడ్ మోడల్‌లో జరగాలా? అనే అంశంపై ఐసీసీ సభ్య దేశాలను ఓటింగ్‌కు అడిగే అవకాశం ఉంది. ఓటింగ్‌లో మెజార్టీ ఆధారంగా చాంపియన్స్ ట్రోఫీ వేదిక మార్పుపై నిర్ణయం తీసుకోనుంది.

షెడ్యూల్ ఆలస్యం

చాంపియన్స్ ట్రోఫీలో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి. 2025 ఫిబ్రవరి 19 నుంచి మార్చి వరకు ఈ టోర్నీ జరుగనుంది. కనీసం 100 రోజుల ముంగిట గ్లోబల్ టోర్నీ షెడ్యూల్ విడుదల చేయటం ఐసీసీకి సంప్రదాయంగా వస్తోంది. 2025 చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. పాకిస్థాన్‌లోని లాహోర్, కరాచీ, రావల్పిండి వేదికగా మెగా టోర్నీ నిర్వహణకు ఓ వైపు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ట్రోఫీ టూర్ సైతం ఇప్పటికే మొదలైంది. అయినా, వేదికపై సభ్య దేశాలకు ఎటువంటి స్పష్టత లేదు.

పాక్‌లో రాజకీయ అనిశ్చితి!

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చైర్మన్ మోషిన్ నక్వీ అక్కడి ప్రభుత్వంలోనూ కీలక సభ్యుడు. కేబినెట్‌లో ఇంటీరియర్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి, క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఇమ్రాన్‌ఖాన్ సారథ్యంలోని పీటీఐ పార్టీ ఇస్లామాబాద్‌లో భారీ ఎత్తున రాజకీయ నిరసన ప్రదర్శనలు చేపడుతోంది. దీంతో మోషిన్ నక్వీ పరిస్థితులు చక్కదిద్దేందుకు గత రెండు రోజులుగా ఇస్లామాబాద్‌లోనే ఉంటున్నారు. పాక్‌లో ఆడేందుకు భారత్‌కు ఉన్న అభ్యంతరాలు లిఖితపూర్వకంగా అడిగిన పీసీబీ.. బీసీసీఐతో మాట్లాడేందుకు ఆసక్తి చూపించింది. కానీ భారత ప్రభుత్వం రోహిత్‌సేన పాక్‌లో అడుగుపెట్టేందుకు అనుమతి ఇవ్వలేదు. ఇదే విషయాన్ని ఐసీసీకి బీసీసీఐ తెలియజేసింది.

వేదిక అంశంపై ఓటింగ్ నిర్వహిస్తే.. ఇతర సభ్య దేశాలు భారత్‌కు అనుకూలంగా వ్యవహరించేందుకు బీసీసీఐ పావులు కదుపనుంది. జై షా తదుపరి చైర్మన్ కావటంతో సహజంగానే ఇతర దేశాల మద్దతు ఉండనుంది.

# ఐపీఎల్ వేలంలో అనూహ్యమైన ధర.. రాత్రికి రాత్రే కోటీశ్వరులైన యువ ఆటగాళ్లు వీరే!

**– ఈసారి ఐపీఎల్ వేలంలో పెద్దగా పేరు లేని కొంతమంది యువ ఆటగాళ్లకు ఊహించని ధర**

**– దాంతో యంగ్ ప్లేయర్స్ ఓవర్‌నైట్‌లో కోటీశ్వరులైన వైనం**

**– ఈ జాబితాలో రసిక్ సలాం, అల్లా గజన్‌ఫర్, ప్రియాంశ్ ఆర్య, అశుతోశ్ శర్మ**




ఈసారి ఐపీఎల్ వేలంలో పెద్దగా పేరు లేని కొంతమంది యువ ఆటగాళ్లు అనూహ్యమైన ధర దక్కించుకుని రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు. ఫ్రాంచైజీలు పోటీపడి మరీ వారిపై కోట్లు గుమ్మరించాయి. దాంతో యంగ్ ప్లేయర్స్ ఓవర్నైట్‌లో కోటీశ్వరులైపోయారు. ఇలా ఊహించని ధర పలికిన కొందరు యువ ఆటగాళ్లు, వారిని దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు ఎంతెంత చెల్లించాయి వంటి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

రసిక్ సలాం..

ఎమర్జింగ్ ఆటగాళ్ల ఆసియా కప్‌లో ఈ 18 ఏళ్ల ఈ పేసర్ తనదైన బౌలింగ్‌తో అదరగొట్టాడు. టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు పడగొట్టాడు. అయితే వయసు ధ్రువపత్రంలో తప్పిదం కారణంగా 2019లో రసిక్‌పై రెండేళ్ల నిషేధం పడింది. ఇప్పుడు పునరాగమనంలో బాగా రాణిస్తుండడం అతనికి బాగా కలిసొచ్చింది. దాంతో ఈసారి వేలంలో ఏకంగా రూ.6 కోట్లు వెచ్చించి ఆర్‌సీబీ కొనుగోలు చేసింది.

అల్లా గజన్‌ఫర్..

ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన అల్లా గజన్‌ఫర్ వయసు కేవలం 18 ఏళ్లే. ఈ యువ ఆటగాడు ఆ దేశానికే చెందిన బౌలర్ రషీద్లానే మరో మిస్టరీ స్పిన్నర్. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన ఇతడు, తాజాగా బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే మ్యాచ్‌లో 6 వికెట్ల తీసి అదరగొట్టాడు. దాంతో ఈసారి వేలంలో అతడి కోసం గట్టి పోటీ నెలకొంది. చివరికి ముంబయి ఇండియన్స్ రూ.4.8 కోట్లకు ఇతడిని దక్కించుకుంది. ఐపీఎల్ వేలంలో మొదటిసారి తన పేరును నమోదు చేసుకున్నా అల్లా గజన్‌ఫర్ ఇలా భారీ ధరకు అమ్ముడుపోయి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు.

ప్రియాంశ్ ఆర్య..

చిచ్చరపిడుగు ప్రియాంశ్ ఆర్య ఇటీవల ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు బాది తన పేరు మార్మోగేలా చేశాడు. ఇదే టోర్నీలోని మరి కొన్ని మ్యాచుల్లోనూ అద్భుతంగా రాణించాడు. దీంతో ఈ హార్డ్ హిట్టర్ కోసం గట్టి పోటీ నెలకొంది. ఆఖరికి పంజాబ్ కింగ్స్ రూ. 3.8 కోట్లకు ఆర్యను కొనుగోలు చేసింది.

అశుతోశ్ శర్మ..

2024 ఐపీఎల్ సీజన్ చివర్లో పంజాబ్ కింగ్స్ కొన్ని విజయాలు సాధించడంలో శశాంక్ సింగ్‌తో పాటు అశుతోశ్ శర్మ కీలకంగా వ్యవహరించాడు. గత సీజన్‌లో పంజాబ్ తరఫున 11 మ్యాచులు ఆడిన అశుతోశ్ ఏకంగా 167 స్ట్రైక్ రేట్‌తో 189 రన్స్ బాదాడు. దీంతో వేలంలో అశుతోశ్‌కు ఈసారి భారీ ధర పలికింది. ఢిల్లీ క్యాపిటల్స్ అతడి కోసం ఏకంగా రూ.3.8 కోట్లు వెచ్చించింది.

గుర్జన్ సింగ్..

చాలా ఎత్తుగా ఉండే ఈ ఎడమచేతి వాటం పేసర్ తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో దిండిగల్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ సీజన్‌లో ఆ జట్టు టైటిల్ గెలవడంలో గుర్జన్ కీలకంగా వ్యవహరించాడు. అలాగే ఈ పొడగరి ఫాస్ట్ బౌలర్ దేశవాళీ క్రికెట్‌లోనూ నిలకడగా రాణిస్తూ ఆకట్టుకుంటున్నాడు. మంచి స్పీడ్‌తో బంతులు విసరగల ఈ ఫాస్ట్ బౌలర్‌ను చెన్నై సూపర్ కింగ్స్ రూ.2.2 కోట్లకు కొనుగోలు చేసింది.

ఇషాన్ మలింగ..

ఐపీఎల్ ఆల్ టైం గ్రేట్ బౌలర్లలో ఒకడు లసిత్ మలింగ. ఇప్పుడు అతని పేరుకి దగ్గరగా వుండే మరో టాలెంట్ పేసర్ లంక క్రికెట్లో అదరగొడుతున్నాడు. అతడే ఇషాన్ మలింగ. ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. ఆసియా కప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకడిగానూ నిలిచాడు. అయితే, ఇంకా అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇతడిని సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.1.2 కోట్లకు దక్కించుకుంది.

# స్వదేశానికి గౌతం గంభీర్

### రెండు రోజుల వార్మప్‌కు దూరం



పెర్త్ (ఆస్ట్రేలియా): భారత జట్టు చీఫ్ కోచ్ గౌతం గంభీర్ మంగళవారం స్వదేశానికి బయల్దేరాడు. వ్యక్తిగత కారణాలతో గౌతం గంభీర్ పెర్త్ నుంచి నేరుగా న్యూఢిల్లీకి రానున్నాడు. దీంతో నవంబర్ 30 నుంచి కాన్‌బెర్రాలో ఆరంభం కానున్న రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌కు గంభీర్ అందుబాటులో ఉండటం లేదు. రెండో టెస్టు మ్యాచ్ ఆరంభ సమయానికి గంభీర్ తిరిగి జట్టుతో చేరతాడని బోర్డు వర్గాల సమాచారం. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ పెర్త్‌లో టీమ్ ఇండియాతో చేరగా.. ఆ వెంటనే గంభీర్ జట్టుకు దూరమయ్యాడు. భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు అడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి ఆరంభం కానుంది. డే నైట్ పింక్ బాల్ టెస్టు కోసం భారత జట్టు రెండు రోజుల వార్మప్‌లో సాధన చేయనుంది. వార్మప్ మ్యాచ్ డే మ్యాచ్ అయినా.. గులాబీ బంతి వాడనున్నారు. గంభీర్ గైర్హాజరీలో సహాయక కోచ్‌లు అభిషేక్, మోర్కెల్, రియాన్‌లు సంయుక్తంగా జట్టుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఎడమ చేతి బొటన వేలు గాయంతో పెర్త్ టెస్టుకు శుభ్‌మన్ గిల్ దూరం అయ్యాడు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఇద్దరూ అందుబాటులోకి వస్తే అడిలైడ్ టెస్టులో మార్పులు అనివార్యం. దేవదత్ పడిక్కల్ బెంచ్‌కు పరిమితం కావటం ఖాయం. కానీ మరో స్థానం కోసం ఎవరిని పక్కనపెడతారో చూడాలి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**